ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


అన్నమయ్య

జిల్లా వార్తలు

5


బుధవారం 3 సెప్టెంబరు 2025

పింఛాలో జలకళ


పింఛా ప్రాజెక్టు

కూటమి ప్రభుత్వంతో పింఛా (యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి) జలాశయానికి మహర్దశ వచ్చింది. అధికారికంగా సుమారు 4 వేల ఎకరాలకు సాగునీటిని అందించే ప్రాజెక్టు ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మట్టికట్ట పనులను పూర్తి చేసింది. దీంతో ప్రాజెక్టులో నీరు నిలువ ఉండి రైతులకు సాగునీరు అందుతోంది.
ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 0.3276 టీఎంసీలు కాగా కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టు రైతాంగానికి సాగునీటిని అందిస్తోంది.

- కూటమితో మహర్దశ
- రూ.86 కోట్లతో పనులు పూర్తి
- మరో రూ.20 కోట్లతో ప్రతిపాదనలు
- గేటు నిర్మాణానికి రూ.17 లక్షలతో టెండర్లు పూర్తి


నీటితో కళకళలాడుతున్న ప్రాజెక్టు

సుండుపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నివర్ తుఫానుతో వచ్చిన వరదల కారణంగా 2020 సంవత్సరం నవంబరు 26వ తేదీ ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోయింది. అనంతరం 2021 నవంబరులో వచ్చిన వరదలకు రింగ్‌బండ కొట్టుకుపోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేయడం వలన ముడుంపాడు, మాచిరెడ్డిగారిపల్లె, పెద్దినేని కాలువ, రాయవరం గ్రామ పంచాయతీల రైతులు, ప్రజలు తాగు, సాగునీటి కోసం అష్టకష్టాలు పడ్డారు. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో సీపీఐ ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలతో పాటు ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు పింఛా ప్రాజెక్టు నుంచి రాయచోటి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేయడంతో వైసీపీ ప్రభుత్వంలో చలనం వచ్చింది. 2023 సంవత్సరంలో రూ.84.33 కోట్లతో టెండర్లు పూర్తి చేసి పనులు ఆర్భాటంగా ప్రారంభించినా నిధులు మంజూరు చేయకపోవడంతో అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. ఆ ప్రభుత్వం అంతా కేవలం రూ.11 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో నాలుగు గ్రామ పంచాయతీల రైతులు సాగుకు నీరు లేక అనేక ఇబ్బందులు పడ్డారు.

రూ.20 కోట్లతో ప్రతిపాదనలు

ప్రాజెక్టు మొరవ, గెస్ట్‌హౌస్ నిర్మాణాలకు రూ.20 కోట్లతో ప్రభుత్వానికి నెల రోజుల క్రితం ప్రతిపాదనలు పంపించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. తాత్కాలికంగా రెండు గుట్టల మధ్యలో మొరవ నిర్మాణం చేశారు. అయితే రానున్న రోజుల్లో ప్రాజెక్టుకు ఇబ్బంది లేకుండా కాంక్రీట్‌తో మొరవ నిర్మాణం చేసేందుకు సీఈసీడీవో అధికారుల ప్లానింగ్ ప్రకారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

రూ.75 లక్షలతో టెండర్లు

నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన కుడి కాలువ నిర్మాణం పూర్తయ్యింది. 290 మీటర్లు నూతనంగా కాలువ ఏర్పాటు చేశారు. అయితే ఆ కాలువకు నీటి సరఫరా మరింత సులభతరంగా ఉండేందుకు రూ.75 లక్షలతో టెండర్లు పూర్తి చేశారు. త్వరలో పనులు ప్రారంభించి కుడికాలువ పరిధిలో ఉండే రైతాంగానికి మరింత సులభతరంగా నీటిని అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ కాలువ పరిధిలో అధికారికంగా 17 తూ వ ుులు ఉన్నాయి. సుమారు 2300 ఎకరాల ఆయకట్టు ఉంది. పింఛా ప్రాజెక్టు నుంచి సుమారు 12 కిలోమీటర్లు కుడికాలువ ప్రవహిస్తోంది. ఈ కాలువ సుమారు 6 కుంటలు, చెరువులకు నీటితో నింపుతుంది. ప్రాజెక్టు గేటు నిర్మాణానికి రూ.17 లక్షలతో టెండర్లు పూర్తయ్యాయి. పనులు త్వరగా ప్రారంభించి గేటు నిర్మాణం పూర్తయితే రైతులకు మరింత మంచి జరుగుతుంది.

రూ.86 కోట్లతో పనులు పూర్తి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టు మట్టికట్ట పనులు చకచకా జరిగాయి. 290 మీటర్ల కుడికాలువ పనులను పూర్తి చేశారు. తెగిపోయిన మట్టికట్ట, కుడికాలువ పనులు పూర్తి కావడంతో రైతాంగానికి సాగునీటిని అందిస్తున్నారు. మట్టికట్ట తెగిపోయిన చోట కాంక్రీట్‌తో నిర్మాణం పూర్తి చేశారు. దాదాపు పనులు పూర్తయిపోయాయి. ప్రాజెక్టు తెగిపోయిన సమయంలో వరదలతో కోతలకు గురైన చోట్ల మట్టితో నింపే పనులు చేస్తున్నారు. దిగువ భాగంలో పార్కును ఏర్పాటు చేయనున్నారు.


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మొరవ


నూతనంగా నిర్మించిన కుడికాలువ

నీటిని అందిస్తున్నాము



ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటిని అందిస్తున్నాము. కుడి కాలువ గేటు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాము. ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేశారు. ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చాయి.

- వెంకట్రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

సాగునీటి సమస్య ఉండదు



పింఛా జలాశయం నిండు కుండలా ఉంది. ఇటీవల పడిన వర్షాలకు పైప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వర్షపు నీరు చేరింది. ఏడాది పాటు ప్రాజెక్టు దిగువ భాగంలోని రైతులకు సాగునీటి సమస్య ఉండదు. మొరవ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిండేలా ఉంది.

- నాగేంద్రనాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

24 గంటల్లోనే సీఎం హామీ అమలు

- వెంకటేశ్వరరాజుకు ఈ-ఆటోను అందజేస్తున్న కలెక్టర్


వెంకటేశ్వరరాజుకు ఈ-ఆటో అందచేస్తున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులు

రాజంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు సోమవారం పెన్షన్ల పంపిణీలో భాగంగా ములక్కాయలపల్లెలో వెంకటేశ్వరరాజుకు నూతన ఆటో ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో మంగళవారం కలెక్టర్ అతడిని కొత్త ఎలక్ట్రికల్ ఆటోను అందచేశారు. వివరాలిలా ఉన్నాయి. రాజంపేట మండలం బోయనపల్లెలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ములక్కాయలపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న సుమిత్రమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రూ.15 వేలు పింఛను అందజేశారు. ఆ సమయంలో ఆమె భర్త చంద్రబాబునాయుడుతో మాట్లాడుతూ తాను పాత ఆటో నడుపుకుంటూ జీవనం గడుపుతున్నానని తెలుపగా వెంటనే ముఖ్యమంత్రి ఇతనికి నూతన ఆటోను అందజేయాలని కలెక్టర్ చామకూరు శ్రీధర్‌ను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ వద్ద వెంకటేశ్వరరాజుకు రూ.3.45 లక్షల విలువ చేసే ఎలక్ట్రికల్ ఆటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆటో అందుకున్న వెంకటేశ్వర్‌రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డీఆర్వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా అన్నమయ్య

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంతో అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ఏకగ్రీవంగా ఆమోదించామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో కలిసి అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీతో పాటు 71 స్థాయి కమిటీలు, 71 గ్రామ స్థాయి కమిటీలు, 19 మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. నాటుసారా తీవ్రతను బట్టి ఏ-కేటగిరీ కింద 6 గ్రామాలు, బీ కేటగిరీ కింద 32 గ్రామాలు, సీ కేటగిరీ కింద 33 గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. గుర్తించిన గ్రామాల్లో 650 మంది పాత ముద్దాయిల్లో 494 మందిని సంబంధిత తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీకి ముడి పదార్థమైన బెల్లం వ్యాపారులతో సమావేశాలను జరిపి నాటుసారా తయారీకి బెల్లం సరఫరా చేస్తే కేసుల్లో జిల్లాలో 65 మంది బెల్లం వ్యాపారులను గుర్తించి 36 మందిని బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో నాటుసారా ప్రభావిత ప్రాంతాల నుంచి 325 మందికి ఉపాధి కొరకు గుర్తించి డీఆర్‌డీఏ ద్వారా 125 మందికి రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సమిష్టి కృషి వల్ల నాటుసారాను పూర్తిగా నిర్మూలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూదన్, ఏఈఎస్ జోగేంద్ర, ఆర్డీవో శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎల్డీయం ఆంజనేయులు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ దాసరి నాగార్జున పాల్గొన్నారు.

అంగళ్లు భూవివాదంలో.. పోలీసుల పంచాయితీ

- రాజీకి బాధితులపై ఒత్తిడి
- అప్పటి వైసీపీ వాళ్లే నేటి టీడీపీ

6

సూపర్‌సిక్స్ సూపర్ హిట్

- జిల్లా కేంద్రంగా రాయచోటే
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, ప్రభుత్వ పథకాలను భారంగా కాకుండా బాధ్యతగా ప్రజలకు అందిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మంత్రి క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులాగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాబోవు రోజుల్లో ప్రతి పల్లెకు తాగునీరు అందివ్వడంతో పాటు ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కరువుతో అల్లాడుతున్న రాయలసీమ జిల్లాలకు హంద్రీనీవా-గాలేరు నగిరి పథకాల ద్వారా సాగు, తాగునీరు అందించేందుకు సీఎం కృత నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. రెండో విడతలో హెచ్ఎన్ఎస్ ద్వారా రాయచోటి, పీలేరు, పుంగనూరు, మదనపల్లి నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ లైనింగ్ ప్రధాన కాలువ పనులకు రూ.350 కోట్లు మంజూరైందని, త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు చేపడతామని తెలిపారు. గత ఏడాదిన్నర కాలంలో రూ.100 కోట్ల నిధులతో తాగునీరు, రహదారుల అభివృద్ధి పనులు చేశామని ఆయన తెలిపారు. రూ.100 కోట్లతో రాయచోటిలో ఆయుశ్ యునాని మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాయచోటిలో నూతన ఆర్టీసీ రెండో బస్టాండు, ఇండోర్ స్టేడియంల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 11న రాయచోటి ఏరియా ఆస్పత్రి ఆవరణలో 50 పడకల ట్రామా కేర్ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. నా ఊపిరి ఉన్నంతవరకు రాయచోటి ఎప్పటికీ జిల్లా కేంద్రంగానే ఉంటుందని, వైసీపీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. అనంతరం వివిధ కార్పొరేషన్లకు ఎంపికైన నాగేశ్వర్‌నాయుడు, రెడ్డెయ్యలను సన్మానించారు. సమావేశంలో గాజుల ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట సమీపంలోని సీతారాముల కల్యాణోత్సవ వేదిక సమీపంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లను మంగళవారం ఉదయం టీటీడీ ఎస్టేట్ అధికారి సువర్ణమ్మ, టీటీడీ తహసీల్దారు లలితాంజలి ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు-15 20/2సి 3లో 56 సెంట్లు ఆలయానికి చెందిన స్థలం ఉందన్నారు. ఈ స్థలంలో సుమారు 10 సెంట్లు ఆక్రమించి కబ్జాదారులు సిమెంటు బ్రిక్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. బ్రిక్స్ యజమానులకు కొన్ని నెలలుగా నోటీసులు ఇచ్చి ఖాళీ చేయాలని చెప్పినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేకుల షెడ్లను తొలగించామన్నారు. ఈ ప్రాంతంలో 23.82 సెంట్లు ఆలయానికి చెందిన స్థలం ఉందన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఏఈ అమర్‌నాథరెడ్డి, విజిలెన్స్ అధికారి గంగులయ్య, ఒంటిమిట్ట వీఆర్వో అంజి, వీఆర్ఏ నరసింహులు, సర్వేయర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మన ఇంటి నుంచే మార్పు రావాలి

- కొప్పర్తిలో లక్ష ఉద్యోగాలు కల్పిస్తాం
- ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్
- కొప్పర్తిలో రెండు పరిశ్రమలు..
- సీకేదిన్నెలో స్మార్ట్‌కిచెన్ ప్రారంభం


స్మార్ట్ కిచెన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేశ్

సీకేదిన్నె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్పు అనేది ఎక్కడో రాదని, మన ఇంటి నుంచే రావాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో నూతనంగా ఏర్పాటైన ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనం, ఎంఎస్ టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, కొప్పర్తి మెగా ఇండ్రస్ట్రియల్ హబ్‌లోని టెక్సాసానా వరల్డ్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలను మంగళవారం మంత్రి లోకేశ్, ఇన్‌చార్జి మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్పు అనేది మన ఇంటిలో నుంచి రావాలని అన్నారు. కొప్పర్తిలో లక్ష మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మహిళలకు ఏ సమస్య ఉన్నా ఒక మెసేజ్ పంపితే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే తొలి స్మార్ట్ కిచెన్

విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా సీకేదిన్నె ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్‌కిచెన్ ఏర్పాటు చేశామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇక్కడ విజయవంతం అయితే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. జమ్మలమడుగు మండలంలో రెండు, కడపలో ఒక స్మార్ట్ కిచెన్‌ను మంత్రి లోకేశ్ వర్చువల్‌గా ప్రారంభించారు.


పెండ్లిమర్రిలో కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

ఆదర్శ డిగ్రీ కళాశాలను ప్రారంభించిన మంత్రి లోకేశ్

మండల పరిధిలోని చెర్లోపల్లె పంచాయతీలో రూ.12 కోట్లతో నిర్మించిన అధునాతన ఆదర్శ డిగ్రీ కళశాల భవనాలను మంత్రి నారా లోకేశ్ మంగళవారం ప్రారంభించారు. యోగివేమన యూనివర్శిటీకి సంబంధించి డిగ్రీ కళాశాల లోపల రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆడిటోరియం, నూతన పరిపాలన భవనానికి శంకుస్థాపన చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : మంత్రి

కార్యకర్తలకు అండగా ఉంటామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి కొలుములపల్లెలో 69వ ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలి వచ్చారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారితో ఫొటోలు దిగారు. దాదాపు నాలుగు గంటలకుపైగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏడు గంటల తర్వాత మంత్రి లోకేశ్ బయల్దేరి విమానాశ్రయం చేరుకుని 7.40 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరారు. మంత్రికి వీడ్కోలు పలికినవారిలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీజీ భరత్, ఎమ్మెల్యేలు మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

యూరియా పంపిణీలో గందరగోళం

- బయట మండలాల రైతులకు పంపిణీపై స్థానికుల ఆగ్రహం
- సబ్‌కలెక్టర్ కళ్యాణి జోక్యం


రైతులకు సర్దిచెబుతున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి


ఎరువుల గోదాము వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యూరియా పంపిణీపై కచ్చితమైన నిబంధనలు పెడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం యూరియా పంపిణీలో గందరగోళం జరుగుతూనే ఉంది. అంతంత మాత్రం సరఫరా అవుతున్న యూరియా పంపిణీలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకుండా చేస్తుండటంతో గందరగోళ పరిస్థితులు వస్తున్నాయి. మంగళవారం మదనపల్లె పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయం, ఎరువుల డీలర్ గోదాము వద్ద రైతుల ఆందోళనలు, ఆగ్రహాల మధ్య యూరియా పంపిణీ జరిగింది. మదనపల్లె మండలానికి మంగళవారం 50 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఒక ప్రైవేటు ఎరువుల డీలర్‌కు యూరియా సరఫరా కాగా బసినికొండ కింద గోదాములో నిల్వ చేశారు. ఈ క్రమంలో యూరియా కోసం వచ్చిన రైతులకు వ్యవసాయశాఖ ఏవో నవీన్‌కుమార్ రైతుల పాసుపుస్తకాలు తీసుకొచ్చాక వారికి ఒక్కో టోకెన్‌కు రెండు బస్తాల చొప్పున యూరియాను కేటాయించారు. కాకపోతే మదనపల్లె మండలంతో పాటు నిమ్మనపల్లె, రామసముద్రం, పుంగనూరు మండలాలకు చెందిన రైతులు కూడా వచ్చి టోకెన్లు తీసుకెళ్లారు. దీంతో మదనపల్లె మండల రైతులకు టోకెన్లు లేకపోవడంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి అక్కడికి చేరుకుని రైతులతో చర్చించారు. రైతులకు అవసరమైన మేరకు ఇంకా యూరియా స్టాకు వస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మదనపల్లె మండల రైతులకు సరిపడా యూరియా ఇచ్చాకే బయట మండలాల రైతులకు ఇవ్వాలని ఏవోకు సూచించారు. కాగా ఎరువుల డీలరు గోదాము వద్ద మధ్యాహ్నానికికే యూరియా స్టాకు అయిపోవడంతో, ఇదివరకే టోకెన్లు పొందిన రైతులు యూరియా లేక ఖాళీగా వెనుతిరిగారు.

వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి పవిత్రోత్సవాలకు మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో 2 నుంచి 5వ తేదీ వరకు ప్రసన్న వేంకటరమణస్వామి పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను ముఖ మండపంలో ఉంచి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి టీటీడీ ఆగమ సలహాదారు మణికంఠ భట్టర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్, ఉప అర్చకులు రమేష్‌బాబు స్వామి శ్రీవారికి భగవతారాధన నిర్వహించి అనంతరం పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. బుధవారం ఉదయం చతుష్టానార్చనం, పవిత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, స్నపన తిరుమంజనం, సాయంత్రం చతుష్టానార్చన హోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నగేష్, భక్తులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ



రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ చాటిన మదనపల్లె విద్యార్థులు


మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రోప్ స్కిప్పింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపారు. నంద్యాల జిల్లా డోన్‌లో ఆగస్టు 31న నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. మదనపల్లె పట్టణం, నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.తేజేశ్వర్ (డబుల్ అండర్ ద్వితీయ), శిరీష్‌కుమార్ (హెచ్‌పీపీ ద్వితీయ), స్పీడ్ స్ప్రిన్ట్‌లో తృతీయ స్థానంలో గెలుపొందారు. వీరిని పీడీ లత, హెచ్‌ఎం శ్రీనప్ప అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీకుమార్, శ్రీబాబు, పద్మజ, మధుమతి, లలితకుమారి, మాధవి, పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము రికవరీ



ఎంపీడీఓకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న దృశ్యం

కురబలకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా ప్రభుత్వం పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ సొమ్మును పూర్తిగా రికవరీ చేసినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. ఎంపీడీఓ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంగళ్లు పంచాయతీ జోగివారిపల్లెకు చెందిన వెంకటరమణ తెట్టు సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తెట్టు పంచాయతీ పరిధి హరిజనవాడలో లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన సొమ్మును ఇవ్వకుండానే పరారైన విషయం తెలిసిందే. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామప్ప ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా ఉద్యోగి తండ్రి శ్రీనివాసులు సోమవారం రూ.3లక్షలు ఎంపీడీఓకు అందజేయగా, మిగిలిన సొమ్మును మంగళవారం అందజేశారు. దీంతో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.



కుదువకు పేదల గూడు

- చెరబడుతున్న ప్రైవేటు ఫైనాన్స్‌లు
- అప్పులు తీర్చుకోవడం కోసం వడ్డీల ఊబిలోకి..
- చాపకింద నీరులా పల్లెలకు పాకుతున్న జాడ్యం

బి.కొత్తకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అవును.. తలదాచుకునేందుకు కట్టుకున్న గూడు... ఆత్మాభిమానానికి, సమాజంలో మదింపునకు తార్కాణంగా నిలిచే నివాసం.. ఆస్తిపై రుణం ముసుగులో కుదవకు వెళుతోంది. అప్పులు తీర్చుకోవచ్చనే ఆశతో కార్మికులు, రైతులు ఆత్మాభిమానాన్ని ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులకు తాకట్టుపెడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక సమస్యలు వచ్చినపుడు అప్పులు చేస్తారు. ఇంట్లోని బంగారు కుదువకు పెడతారు. ఇంకా అంటే పరువు పోకుండా భూములు మార్టిగేజ్(చూపుడాయకం)చేసి అప్పు తీసుకుంటారు. ఇది అంతకంటే ఘోరం... పెళ్లాం పిల్లలతో కలిసి ఉంటున్న ఇంటినే ఆయకం పెట్టే క్రమంలో ఫైనాన్స్ సిబ్బంది చేష్టలతో జరిగే అవమానం ఒక ఎత్తు అయితే, నెలవారీ కంతులు కట్టలేని పరిస్థితిలో వాళ్లు చేసే అవమానకర పనులతో రుణదాతలు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. మదనపల్లె, బి.కొత్తకోట కేంద్రాలుగా పనిచేస్తున్న ఈ ప్రైవేటు బ్యాంకుల ఉచ్చులో వేల కుటుంబాలు చిక్కుకొని విలవిలలాడుతున్నాయి.

చిన్నచిన్న అప్పులు తీర్చడం కోసం.. పెద్దఅప్పు

బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు మండలాలతోపాటు సత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో సైతం ప్రతి పల్లెలో పదులసంఖ్యలో కుటుంబాలు తమ ఇళ్లను తాకట్టుపెట్టి ఒక్కొక్కరు రూ.4లక్షల నుంచి రూ.7 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు.




బి.కొత్తకోట మండలంలో ఓ ఇంటి ముందు రాసిన నోటీసు

అప్పులలో కూరుకుపోయి బాధలు పడుతున్న వారికి ఈ ఫైనాన్స్ బ్యాంకులు ఊరిస్తున్నాయి. ఒకరిని చూసి మరొకరు వీటిపట్ల ఆకర్షితులవుతూ ఇళ్లను తాకట్టుపెట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఉదాహరణకు వెంకట్రమణ టైలర్ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటిపని చేయడానికి, కొడుకు చదువుకు అప్పులు చేశాడు, డైలీ, వీక్లీ కలెక్షన్‌లకు తీసుకున్నాడు. ఈ కలెక్షన్లు, వడ్డీలు, చీటీలు కట్టలేక దిక్కుతోచని స్థితిలో తాను కొత్తగా నిర్మించిన ఇంటిని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌కు కుదవపెట్టి రూ.7.60లక్షలు తీసుకున్నాడు. అంతా అప్పులకే సరిపోయింది. తీరా ఆ ఫైనాన్స్ వడ్డీరేటు చూస్తే దిమ్మతిరిగింది. నెలవారీ కంతులు ఏకంగా ఎనిమిది సంవత్సరాలు చెల్లిస్తేకానీ అప్పు తీరదు.

రిజిస్ట్రేషన్ అవుతుందనే ఆశతో..

గ్రామాలలో చాలామందికి తాము ఉంటున్న ఇళ్లకు ఎటువంటి పట్టా, రిజిస్ట్రేషన్ ఉండదు. చాలావరకు గ్రామకంఠం వుంటుంది. అలాంటి వారికి వీరు గాలం వేస్తారు. వీఆర్వో దగ్గర సంతకం పెట్టిస్తే భార్యకు గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించి, భార్య దగ్గర నుంచి ఫైనాన్స్ కంపెనీ పేరిట మార్టిగేజ్ చేసుకుంటారు. ఇందుకయ్యే ఖర్చంతా కుటుంబీకులే భరించాలి. అప్పు దొరుకుతుంది, ఇల్లు రిజిస్టర్ అవుతుందన్న ఆశతో పేదలు వీరి బుట్టలో పడి, రుణాలు తీసుకొని అధిక వడ్డీలతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.



వీఆర్వో రాసిచ్చిన సర్టిఫికెట్

రుణాల వసూళ్లు మరీ ఘోరం

ఈ ఫైనాన్స్‌ల వద్ద అప్పులు తీసుకున్న వారికి టార్చర్ మామూలుగా వుండదు. నిత్యం ఫోన్‌లో వేధింపులు. ఒక్క నెల కట్టకపోయినా చక్రవడ్డీ పడుతుంది. మూడు నెలలు కట్టకపోతే లాయర్ నోటీసు వస్తుంది. ఇంటిపై అప్పు ఉన్నట్లు ఇంటి ముందు గోడకు బోర్డు రాస్తారు. అప్పటికీ కట్టకపోతే కోర్టు, పోలీసుల ద్వారా ఇంటిని సీజ్ చేయిస్తారు. ఊరిలో చాటింపు వేయించి మరీ రుణగ్రస్తుడి ఇంటిని జప్తు చేసి వేలం వేస్తారు. కార్మికులు, సన్నకారు రైతులకు రెగ్యులర్‌గా ఆదాయం ఉండదు. దీంతో వాయిదా పైకం చెల్లించలేక సిబ్బంది చేసే అవమానాలు భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆ ఊబిలోంచి బయట పడలేక లబోదిబోమనే కుటుంబాలు పల్లెలలో పెద్దసంఖ్యలో దర్శనమిస్తున్నాయి.

రుణం ఇవ్వకుండానే పరువు తీసే సిబ్బంది..

ఈ ఫైనాన్స్ కంపెనీ ద్వారా రుణం తీసుకునే కుటుంబానికి ఆదిలోనే సగం పరువు పోతోంది. మార్టిగేజ్ చేయబోయే ఇంటి వద్దకొచ్చి కొలతలు వేస్తారు. నాలుగు దిక్కుల నుంచి ఫోటోలు తీస్తారు. ష్యూరిటీ ఇచ్చే వ్యక్తి ఇంటినీ ఫోటోలు తీస్తారు. పరిశీలన పేరుతో ఒకటికి నాలుగుసార్లు వచ్చి ఊరంతా ఆ కుటంబం గురించి ఆరా తీస్తారు. ఈ ఇల్లు తాకట్టుకు పోతోందని సగం ఊరికి అప్పటికే తెలిసేలా చేస్తారు. దీంతో అప్పటిదాకా కాపాడుకున్న పరువు కాస్తా పోతుంది.

కోటగంగమ్మకు జ్యోతులు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్లెల గ్రామంలో మంగళవారం మహిళలు కోటగంగమ్మకు జ్యోతులను మోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వినాయక చవితి అయిపోయిన మరుసటి రోజు గ్రామదేవతల్లో ఒకరైన కోట గంగమ్మకు ఆనవాయితీగా మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులను సమర్పించి ఇంటింటికీ బోనాలు పెట్టి, జంతుబలులు సమర్పించి మొక్కుబడులను తీర్చుకుంటారు. రాత్రి గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామంలో మేళతాళాలు మంగళ వాయిద్యాలు కోలాటలు, చెక్కభజనలు, బళ్లారి డ్రమ్ములతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.



కోట గంగమ్మకు సమర్పించేందుకు పెద్ద ఎత్తున జ్యోతులను తీసుకెళుతున్న మహిళలు

వాటర్ షెడ్ల ద్వారా నీటి నిల్వ : పీడీ



వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న పీడీ

పెద్దమండ్యం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జలాలు పెంపొందించడానికే వాటర్ షెడ్ల ద్వారా నీటి నిల్వ అభివృద్ధి పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. మండలంలో పీడీ పర్యటించారు. సి.గొల్లపల్లి, గుర్రంవాండ్లపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న మైక్రో వాటర్‌షెడ్ల అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్‌షెడ్ పథకం ద్వారా జరుగుతున్న పనులపై ఆయా సిబ్బందితో సమీక్షించారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి వాటర్‌షెడ్లు దోహదపడాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా వాటర్ షెడ్ల నిర్మాణాలు జరగాలని, బాధ్యతగా పని చేయాలన్నారు. సిబ్బందికి కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్వామా ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, వాటర్‌షెడ్ పీఓ రవీంద్రుడు, ఉపాధి ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది శివయ్య, మోహన్ వాటర్‌షెడ్ల చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంపై అవగాహన

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) అధ్వర్యంలో తుమ్మరకుంటలో మంగళవారం రైతులకు పట్టుపురుగుల పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సిరికల్చర్ (ఏడీ) రామమోహన్ రైతులతో మాట్లాడుతూ పట్టు పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టుసాగుకు చేయూతనందిస్తోందని రైతులు పట్టుసాగు, మల్బరీ తోటల పెంపకం పట్టుపురుగులను పెంచుకునేందుకు షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించారు. పట్టుసాగుతో రైతులకు ఒనగూరే లాభాలు, మల్బరి తోటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ మార్గాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పట్టు గూళ్లను మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, కోటవీధికి చెందిన నాగరాజు (41) కార్పెంటర్‌గా పనిచేస్తుండేవాడు. 20 ఏళ్ల క్రితం మదనపల్లె పట్టణం రామారావుకాలనీకి చెందిన వనితతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం జరిగిన ఐదేళ్ల తరువాత విడిపోయి వేరు వేరుగా ఉంటున్నారు. కాగా నాగరాజు మద్యానికి బానిసై ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండేవాడు. తల్లిని, భార్యను వదిలి విడిగా ఉండడంతో ఎవ్వరూ పట్టించుకునేవారు కాదు. కాగా సోమవారం మధ్యాహ్నం బసినికొండ సమీపంలో ఉరేసుకుని మృతి చెందాడు. మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో తల్లి లతను పోలీసులు విచారించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో దూడ...



కుక్కల దాడిలో మృతి చెందిన దూడ

రామసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతలపేటలో వీధి కుక్కలు దాడి చేసి లేగ దూడను చంపేశాయి. గ్రామానికి చెందిన కుమార్‌కు రెండు ఆవులు ఉన్నాయి. వాటిలో ఒక లేగదూడ ఉంది. వీటిని తన వ్యవసాయ పొలంలో మేత కోసం వదలగా లేగ దూడపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. జీవనోపాధికి పెంచుకున్న దూడ మృతితో రైతు కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వీధి కుక్కలతో మనుషులే కాకుండా మూగ జీవాలు సైతం దాడికి గురవుతున్నాయని, కుక్కల దాడులను అరికట్టడానికి ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టైల్స్ షాపు యజమాని ఆత్మహత్యాయత్నం



సెల్ఫీ వీడియోలో దామోదర్‌రెడ్డి

రాజంపేటటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ టైల్స్ షాపు యజమాని సెల్ఫీ వీడియో తీసు కుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. రాజంపేట పట్టణంలోని మన్నూరు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న వైష్ణవి టైల్స్ షాపు యజమాని దామోదర్‌రెడ్డి మంగళవారం ఉదయం వీడియో రికార్డింగ్ చేస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఇది గమనించిన స్నేహితులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దాయాదుల ఘర్షణ - కేసు నమోదు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై ఘర్షణ పడి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బండ్లపై గ్రామం హరిజనవాడకు చెందిన మేకల రెడ్డెప్ప వీఆర్‌వోగా చౌడేపల్లిలో పనిచేస్తున్నాడు. అయితే అతనికి తాతల నుంచి కొంత భూమి సక్రమించింది. సదరు భూమి విషయమై దాయాదులతో కుదరక కోర్టులో కేసులు వేసుకొని కేసు నడుస్తోందని తెలిపారు. అయితే కోర్టులో వున్న భూమిని దాయాదులు సరిహద్దులు చెరిపేస్తూ వారి భూమిలో కలుపుకోవాలని చూశారు. ఇంతలో భూమి వద్దకు వెళ్లిన మేకల రెడ్డెప్ప, తన భార్య వనజలను దాయాదులు నాగరాజు, అతని అన్న కుమారుడు ఖదిరిపతి, అతని చెల్లెలు రాధా, తమ్ముడి భార్య సౌజన్యలు భూమి సరిహద్దు చెరిపేయడమే కాకుండా తమను నానా భూతులు తిట్టి కర్రలతో గాయపరిచినట్లు తెలిపారు. దీంతో రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని కాప్పల్లె పంచాయతీ గుట్టవారిపల్లె గ్రామానికి చెందిన శ్రుతి(21) మదనపల్లెలో జ్ఞానాంబిక కళాశాలలో చదువుతోంది. గత నెల 30న ఉదయం కళాశాలకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్థానికులకు టోల్‌గేట్ వసూలు చేయొద్దు

- తుమ్మనంగుట్ట టోల్‌గేట్ వద్ద స్థానికుల నిరసన



టోల్‌గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ములకలచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిపై కొత్తగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్ ఎదుట మంగళవారం స్థానికులు నిరసనకు దిగారు. టోల్‌గేట్‌లో స్థానికులకు మినహాయింపు ఉన్నా టోల్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తుమ్మనంగుట్ట టోల్‌గేట్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టి అనంతరం మాట్లాడుతూ టోల్‌గేట్‌కు ఇరువైపులా ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగించే సమయంలో టోల్ వసూలు చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బురకాయలకోట నుంచి రెండు కి.మీ. దూరంలో ఉన్న తుమ్మనంగుట్ట, గోళ్లపల్లె వెళ్లి వచ్చే టమోటా వాహనాలకు, పాలబండ్లకు రెండు సార్లు టోల్ వసూలు చేస్తున్నారన్నారు. కురబలకోట మండలం ముదివేడు వద్దనున్న టోల్‌గేట్ వద్ద స్థానికులకు టోల్ వసూలు చేయడం లేదని, ఇక్కడ మాత్రం వసూలు చేస్తూ ఇబ్బందులు పెడుతుండడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని స్థానిక వాహనాలకు టోల్ లేకుండా పాసులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, నేతలు గోపాల్‌రెడ్డి, విజయ్ కుమార్, అనిల్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, మౌలాలి, పుల్లప్ప, చాంద్‌బాషా, బావాజీ, మస్తాన్, పూల శ్రీధర్, కేశవ, వత్స పాండే తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లు భూవివాదంలో..

పోలీసుల పంచాయితీ



అంగళ్లులోని వివాదాస్పద భూమి

- రాజీకి బాధితులపై ఒత్తిడి
- అప్పటి వైసీపీ వాళ్లే నేటి టీడీపీ

మదనపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కబ్జాలు, భూ వివాదాలకు నిలయమైన కురబలకోట మండలం అంగళ్లులో అటు స్థానికులు, ఇటు నాయకులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎవరు ఎప్పుడు భూమిలోకి ప్రవేశించి పనులు చేపడతారో అన్నదే వారి భయం. అప్పటి వైసీపీ పాలనలో జరిగిన సంఘటనలే ప్రస్తుతం పునరావృతమవుతున్నాయి. అంగళ్లు రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 220 అంటేనే అది వివాదాల సుడిగుండమని అందరికీ తెలుసు. సర్వేనంబర్ 220లో మొత్తం 69.42 ఎకరాలు కాగా, అందులో 220-1, 2, 3, 4 సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఇందులో హక్కులపై 2017 నుంచీ వివాదం జరుగుతోంది. ఒక సబ్‌డివిజన్‌లో హక్కు ఉంటే, మరో నంబర్‌లోకి ప్రవేశించడం, వివాదం సృష్టించడం, హక్కు లేని వారూ రంగప్రవేశం చేయడం, అమ్మినభూమినే మరొకరికి విక్రయించడం, తదితర కారణాలతో వివాదం ముదిరి పాకానపడింది. ఇందులో రాజకీయ నాయకులు, పోలీసుల రంగప్రవేశం చేయడం, రాజీ కుదుర్చడం షరామామూలైంది. ఈ క్రమంలో అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని 2021లో పులివెందుల బ్యాచ్ రంగప్రవేశం భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. తర్వాత కడప బ్యాచ్, ఆ తర్వాత తిరుపతి, దాని తర్వాత తంబళ్లపల్లె బ్యాచ్ ఇలా రోజులు గడిచే కొద్దీ హక్కుదారులు మారతారు.. కొత్తగా రాజకీయ నాయకులు ప్రవేశిస్తుంటారు. ఈ క్రమంలో వైసీపీ కబ్జాదారులు కొందరు పెద్దనాయకుల అనుచరుల పేరుతో బాధితుల నుంచి రాజీ పేరుతో అక్కడ కొంత భూమిని కూడా రాయించుకున్నారు. మళ్లీ కొన్నాళ్లకు మామూలే అన్నట్లు మరొకరు రంగ ప్రవేశం చేయడం ఇప్పటికే చేపట్టిన ఫెన్సింగ్‌ను రాత్రికి రాత్రే కూల్చేయడంతో వివాదం మొదలవుతోంది. ఇందులో గూడుకోసం ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన పేద, మధ్యతరగతి ప్రజలు బాధితులుగా మారుతున్నారు. పదిరోజుల క్రితం మరోసారి వివాదం జరగడం, సర్వే పేరుతో పోలీసులు, రాజకీయ నాయకుల ప్రవేశంతో అంగళ్లు మరోసారి ఉక్కిరిబిక్కిరి అయింది. ఇక అంతే అప్పటి నుంచీ పోలీసులు ప్రవేశించినట్లు స్థానికులు చెబుతున్నారు. నిత్యం బాధితులను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి పంచాయితీ పెడుతున్నట్లు వాపోతున్నారు. అప్పుడు వైసీపీలో ఉన్నవాళ్లే ఇప్పుడు టీడీపీ పేరుతో అంగళ్లు భూమి పంచాయితీలో ప్రవేశిస్తున్నారు. అప్పట్లో మధ్యవర్తిగా ఉంటూ వైసీపీ నాయకుల పేరున భూమి రాయించిన వారే.. తిరిగీ తాము టీడీపీ అంటూ రంగప్రవేశం చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఇక్కడ హక్కుదారులు, బాధితులు కాకుండా సంబంధం లేని వారు పోలీసులను ఆశ్రయించి పంచాయితీ పెట్టినట్లు చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీ నేతలకు రాయించిన భూమిని తిరిగీ రాయిస్తామని, మిగిలిన భూమిని కూడా తమపేరుతో రాయించాలని స్టేషన్‌లో పంచాయితీ పెట్టి బాధితులపై ఒత్తిడి చేస్తున్నారు. అయితే ఆ భూమి ప్రస్తుతం కోర్టు కేసులు, క్రిమినల్ కేసులు ఉండటంతో రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఇక్కడ ఇప్పటికీ వైసీపీ పాలనే నడుస్తోందని బాధితులు వాపోతున్నారు.

డీఎస్పీ ఏమన్నారంటే

అంగళ్లు వివాదంలో పోలీసుల జోక్యంపై స్థానిక డీఎస్పీ మహేందర్‌ను వివరణ కోరగా.. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోరాదని, అంగళ్లు భూ వివాదంలో పోలీసులు పంచాయతీలు చేస్తున్నట్లు తెలిస్తే, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం.. మంత్రి లోకేశ్

సీకేదిన్నె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. స్థానిక సభాప్రాంగణం వద్ద మధ్యాహ్నం కమలాపురం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ అందరం ఒక కూటమి సభ్యులుగా పనిచేయాలని.. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా.. భయపడాల్సిన అవసరం లేదని నేరుగా తెలియజేస్తే వారికి అండగా ఉంటామన్నారు. మేము కూడా కొన్ని తప్పులు చేస్తుంటామని... ఎత్తిచూపితే పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లినవారికి మంచి గుర్తింపు ఇవ్వడంతోపాటు తగిన పదవులు ఇస్తామన్నారు. ఈనెలాఖరు వరకు అన్నిస్థాయిల్లో కమిటీలు పూర్తిచేస్తామన్నారు. జగన్‌ను కలవడానికి ఇప్పుడు కూడా వీఐపీ పాస్ కావాలంటున్నారని.. అహంకారంతో కాదు, ప్రజల మనస్సు ప్రేమతో గెలువాలని అప్పుడే వారికి దగ్గరవుతామన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు అయిదేళ్లు సమర్థవంతంగా నిర్వహించడం... నాయకులు, కార్యకర్తలు కష్టం ఫలితంగా 2024లోమన విజయం సాధించామన్నారు. పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలని.. ప్రజల చుట్టూ మీరు తిరిగితే.. పార్టీ నీ చుట్టూ తిరుగుతుందన్నారు. సిఫార్సుల ద్వారా పదవులు రావని, పనితీరు ద్వారా మాత్రమే గుర్తింపు వస్తుందన్నారు.పార్టీ సభ్యత్వం, సుపరిపాలన, తొలి అడుగు తదితర కార్యక్రమాలను బాగా అమలు చేసి వారిని గుర్తించడం జరిగిందన్నారు. పార్టీ పదవులు కూడా క్రియాశీలకంగా పనిచేసిన వారికే అందిస్తామన్నారు. ప్రతిచోట కార్యకర్తలకు సమయం కేటాయించి వారి సమస్యలుతెలుసుకోవడం జరుగుతుందన్నారు. దాంతో పాటు వారితో కలిసి ఫోటోలు దిగడం జరుగుతుందన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన మంత్రి సవిత, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి

ప్రేమతో ప్రజల మనస్సు గెలువాలి

అహంకారంతో కాదు ప్రేమ, ఆప్యాయతలతో మనం ప్రజల మనస్సు గెలువాలని మంత్రి లోకేష్ తెలిపారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి. అహకారం లేకుండా బాధ్యతగామెలిగితే గతంలో ఎన్నడు లేని విధంగా కడప జిల్లాలో అధిక సీట్లు సాధించామన్నారు. ఓర్పు, సహనంతో రాజకీయం చేయడంతోనే ఇది సాధ్యమైందన్నారు. వైసీపీ వారు అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో విర్రవీగడంతో 151 సీట్లు 11 సీట్లు అయ్యాయన్నారు. కాగా, 2019-24 మధ్య తప్పుడు కేసులు ఎదుర్కొన్న కార్యకర్తలకు విముక్తి కలిగిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. అటువంటివారి వివరాలు తమ దృష్టికి తేవాలన్నారు.

94 మంది కార్యకర్తలకు అవార్డులు

కమలాపురం నియోజకవర్గంలో 94 మంది ఉత్తమ కార్యకర్తలను గుర్తించి మంత్రి లోకేష్ అవార్డులు అందజేశారు. ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తిస్తానని.. వారికి తగిన న్యాయం చేస్తానని తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలో చింతకొమ్మదిన్నె మండలం నుంచి ఎక్కువ మంది ఉత్తమ కార్యకర్తల అవార్డు అందుకున్నారు. వారందరిని మంత్రి లోకేశ్‌తో పాటు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న వారిలో టీవీ క్రిష్టారెడ్డి, గంధం మోహన్‌బాబు, శ్రీనివాసులరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దర్బార్‌బాష, శివశంకర్, జబివుల్లా, శివానందయాదవ్, బిట్టి ఆది, భద్ర, బ్రహ్మానందరెడ్డి, నంద, తదితరులు ఉన్నారు.

వినతులు స్వీకరణ

మంత్రి లోకేశ్ మంగళవారం ఉదయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరించడంతో పాటు వారితో ఫొటోలు దిగి సంతోషపరిచారు. ఆద్యంతం కార్యకర్తలకే అధిక సమయం కేటాయించడంపట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

మంత్రి పర్యటనను విజయవంతం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి అభినందనలు తెలిపారు. రాబోయే కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత పాటుపడుతానని మంత్రి లోకేష్ తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి నుంచి ఉత్తమ కార్యకర్త అవార్డులు అందుకుంటున్న కార్యకర్తలు

సులువైన ఆటో ప్రయాణం కోసం..

● ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఆటోమ్యాట్ యాప్ రూపకల్పన



ఆటోమ్యాట్ అప్లికేషన్ తయారుచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన డైరెక్టర్ కుమారస్వామి గుప్త, తదితరులు

వేంపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సొంత ఆలోచనతో ఆటోమ్యాట్ యాప్‌ను రూపొందించారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో యాప్ పనితీరు గురించి విద్యార్థులు శివశంకర్, సాయినాథ్, రవితేజ, అంకిత్, సాయికుమార్‌లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆటోలు అందుబాటులో ఉండడం, నిజమైన పారదర్శకమైన ధరల విధానం, విద్యార్థుల భద్రత, ఆటో డ్రైవర్ల ప్రవర్తన, అధికచార్జీలు, ఫిర్యాదులు వంటి ఆప్షన్లు ఈ యాప్‌లో ఉంటాయని, ఆటో డ్రైవర్ల మొబైల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్త మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అప్లికేషన్లు రూపొందించిన విద్యార్థులు అభినందనీయులన్నారు. ప్రయోగాలు చేసి సమాజానికి ఉపయోగపడే కొత్తకొత్త ప్రయోగాలు చేయాలని సూచించారు. అనంతరం విద్యా ర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ కైలాష్, హెచ్‌ఓడీ రత్నకుమారి, శరవన్ కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గండికోట నుంచి 10 వేల క్యూసెక్కులు విడుదల



గండికోట నుంచి మైలవరానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం మధాహ్నం నుంచి 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 10,700 క్యూసెక్కులు, వరద నీరు మరో 500 క్యూసెక్కులు వచ్చి చేరుతోందన్నారు. కాగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 23.473 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

కుమారుడిపై తండ్రి దాడి

జమ్మలమడుగు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో కుమారుడిపై తండ్రి దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు... ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రమేష్‌బాబు రెండు సెంట్ల స్థలానికి సంబంధించి రిజిస్టర్ చేసి ఇవ్వాలని తన తండ్రి మారెన్నను కోరాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మారెన్న మచ్చుకత్తితో కుమారుడిపై దాడి చేశాడు. అదే సమయంలో అడ్డు వచ్చిన తల్లి యల్లమ్మపై దాడి చేశాడు. దీంతో తలకు గాయాలైన రమేష్‌బాబును జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్వామా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



మంత్రి లోకేశ్‌ను కలిసి విన్నవిస్తున్న జేఏసీ చైర్మన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (డ్వామా)లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్‌కు డ్వామా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ కె.మునిశేఖర్‌రాజువినతి పత్రం సమర్పించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. అన్ని కేడర్ల వారికి గ్రేడ్ ఫిక్సేషన్ అమలు చేయడంతో పాటు అన్ని రకాల అలవెన్సులను బేసిక్‌తో కలిపి ఇవ్వాలని కోరారు. అదే విధంగా 2022 వేతన సవరణ ప్రకారం 23 శాతం వేతన పెంపును వెంటనే ఇవ్వాలని, మూడేళ్లు పూర్తయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికి ఎఫ్‌టీఈలుగా కన్వర్ట్ చేయాలని కోరారు. గత ఐదు సంవత్సరాల నుంచి అమలు చేయని అన్ని కేడర్ల వారికి కేరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసిని వెంటనే అమలు చేయాలని కోరారు. కేరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీలో భాగంగా పదోన్నతుల వారికి నష్టపోయిన ఇంక్రిమెంట్లను చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులను ఇప్పించాలని కోరారు.

పింఛన్ డబ్బులతో జూనియర్ లైన్‌మ్యాన్ పరారీ

● లబోదిబోమంటూ ఎంపీడీవో కార్యాలయానికి చేరిన వృద్ధులు ● పోలీసులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ సెక్రటరీ

కాశినాయన, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) కాశినాయన మండల కేంద్రమైన నర్సాపురం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మ్యాన్ దర్శి రాజశేఖర్ సెప్టెంబరు నెలకు సంబంధించి రూ.2,08,500 పింఛన్ డబ్బుతో కన్పించకుండా పోయాడని ఆ గ్రామ సచివాలయ పంచాయతీ సెక్రటరీ డి.సులోచన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ మూలపల్లె, పర్సనపల్లె గ్రామాలలో 63 మంది పింఛన్‌ల పంపిణీకి సంబంధించి రూ.2,86,500 ఇచ్చామన్నారు. సెప్టెంబరు 1 మధ్యాహ్నం వరకు 18 పింఛన్‌లకు రూ.78,000 పంచాడని.. ఆతర్వాత కన్పించకుండా పోయాడన్నారు. ఫోన్ చేసినా ఎత్తడం లేదన్నారు. అతనిపై అధికారులకు తెలియజేసి వారి ద్వారా ఫోన్ చేయించినా స్పందించలేదన్నారు. ప్రస్తుతం అతని వద్ద 45 పెన్షన్‌లకు సంబంధించి రూ.2,08,500 నగదు ఉందన్నారు. ఈవిషయం పైగ్రామాల వృద్ధులకు తెలియడంతో వారంతా లబోదిబోమంటూ మంగళవారం దాదాపు రెండు కి.మీ. నడుచుకుంటూ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఆరా తీశారు.



నర్సాపురం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ సెక్రటరీ

అక్కడి అధికారులు పింఛన్ డబ్బు గురించి ఆందోళన చెందవద్దని.. ఇంటి వద్దకే వచ్చి ఇస్తారని సర్దిచెప్పడంతో వృద్ధులు వెనుదిరిగి పోయారు.

పైపులు పీకేస్తే.. మా పొలాలకు నీరెలా..!

● అధికారులతో రైతుల వాగ్వాదం

చాపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామం వద్ద గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే మేనేజర్ సాయిరెడ్డి, సింహాచలంతో రైతులు మంగళవారం వాగ్వాదానికి దిగారు. ఆ గ్రామం వద్ద నేషనల్ హైవే నిర్మిస్తున్నారు. నెలన్నర రోజుల క్రితం రోడ్డుకు ఇరువైపుల రైతుల పొలాలకు సాగునీరు పారేందుకు రోడ్డు అడుగు భాగంలో పైపులు నిర్మించారు. మంగళవారం పోలీసుల సహాయంతో వాటిని మళ్లీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పైపులు తొలగిస్తే తమ పొలాలకు సాగునీళ్లు అందవని రైతులు అడ్డుకున్నారు. వేరేచోట పైపులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పడంతో అక్కడ భూమి కన్నా ఎత్తుగా ఉండడంతో అనుకూలంగా లేవని రైతులు చెబు తున్నా.. వారి మాటలు వినకుండా అధికారులు పైపులను తొలగించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సౌమ్యనాథస్వామి ఆలయంలో పవిత్రాల ప్రతిష్ఠ

నందలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా పవిత్రాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలబోగము, పవిత్ర హోమం, బలిహరణ, శాత్తుమొర, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం పవిత్ర హోమం, నివేదన, శాత్తుమొర గోష్ఠి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సాయికృష్ణ, పలువురు అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 3న పవిత్రాల సమర్పణ, పవిత్ర హోమం, శాత్తుమొర, నివేదన, 4న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, మహానివేదన, పవిత్ర వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊరేగింపు నిర్వహిస్తారని తెలియజేశారు.



హోమం చేస్తున్న అర్చకులు, స్వామి వారికి పవిత్రాలు సమర్పించిన దృశ్యం

వరి నాట్లకు కూలీల కొరత

● జిల్లాలో ముమ్మరంగా నాట్లు ● 30804 హెక్టార్లలో సాగు లక్ష్యం
● ఒకేసారి వేస్తుండడంతో డిమాండ్ ● రెట్టింపు కూలీ ఇస్తామన్నా.. దొరకని కూలీలు ● నార్లు ముదిరిపోతాయనే ఆందోళనలో రైతులు



వరి నాట్లు వేస్తున్న ఇద్దరు కూలీలు

కడప రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక పోవడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. జూన్, జూలై నెలలో రైతులు వర్షం కోసం ఎదురు చూపులు చూశారు. చివరకు ఆగస్టు మొదటి వారం నుంచి జిల్లాలో ఓ మోస్తారు వర్షాలు పడటంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వస్తుండడంతో కేసీ కెనాల్, పెన్నానది పరివాహ ప్రాంతాలతో పాటు ఇతర వరి సాగు అధారిత ప్రాంతాల్లో రైతులంతా ఒకేసారి వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కూలీల కొరత ఏర్పడింది. సాధారణ రోజుల కన్నా రెట్టింపు కూలీ ఇస్తామంటున్నా కూలీలు అందుబాటులో లేని పరిస్థితి. మామూలు రోజుల్లో వరి నాట్లు వేసేందుకు ఒక ఎకరాకు రూ.5వేలు ఇచ్చేవారు. ఈ క్రమంలో ఆగస్టు మొదటి వారం వరకు అడపాదడపా చేపట్టిన వరినాట్లుకు రూ.5వేలు చెల్లించారు. ఇప్పుడు రూ.7వేలు ఇవ్వడంతో పాటు అదనంగా ఆటో చార్జీలు కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నా కూలీలు దొరకడం లేదు. సాధారణంగా పొలం పనులకు వచ్చే మహిళా కూలీలకు రోజుకు రూ.250 నుంచి రూ. 300ల వరకు ఇస్తారు. అదే వరినాట్లు వేసే కూలీలకు రోజుకు రూ. 500 వరకు ఇస్తారు. ఒక ఎకరా వరి నాటుకు 10 మంది వరకు కూలీలు పడతారు. అదే ఒప్పందం అయితే ఒక ఎకరాకు 5 నుంచి 7 మంది కూలీలు నాట్లు వేస్తారు.

15 మండలాల్లో ముమ్మరంగా వరినాట్లు

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలతో ఆగస్టు మొదటి వారం నుంచి కురుస్తున్న వర్షాలకు కేసీ కెనాల్ ఆయకట్టుతో పాటు, పెన్నానదికి వరద నీరు ప్రవహిస్తోంది. అలాగే జిల్లాలోని గండికోట, మైలవరం, బ్రహ్మంసాగర్, సర్వరాయసాగర్ తదితర ప్రాజెక్టులకు వరద నీరు వచ్చిచేరుతోంది. తద్వారా ఆయా ప్రాంతాలలోని చెరువులకు కూడా నీరు చేరుతోంది. దీంతో ఆయా ఆయకట్టు కింద ఉండే చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, బి.మఠం, ప్రొద్దుటూరు, ఎస్. మైదుకూరు, చెన్నూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, చక్రాయపేట, బి.కోడూరు, వల్లూరు, కలసపాడు, సిద్దవటం, పెండ్లిమర్రి, కడప, రాజుపాళెం, యర్రగుంట్ల, కాశినాయన మండలాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. 2025 ఖరీఫ్‌లో 30,804 హెక్టార్లలో వరి పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 8082 హెక్టార్లలో మాత్రమే వరి సాగైంది. ఇంకా 22,722 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది.



కాలిబాటలు ఏర్పడేలా వరి నాట్లు వేస్తున్న వలస కూలీలు



వలస కూలీలతో వరినాట్లు

● ఆసక్తి చూపుతున్న కేసీ రైతులు

దువ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టులో వలస కూలీలతో వరి నాట్లు వేయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దువ్వూరు మండలంలో పది వేల ఎకరాలకుపైగా కేసీ ఆయకట్టు ఉంది. ఇంచుమించు ఏడు వేల ఎకరాల్లో ప్రతి ఏటా వరి సాగు అవుతుంది. గత నాలుగేళ్లుగా వలస కూలీలు నాట్లు వేసే సమయంలో ఇక్కడకు రావడం జరుగుతోంది. ఈసారి మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి అధికంగా కేసీ ఆయకట్టు పరిధిలో నాట్లు వేసేందుకు వచ్చారు. మండల పరిధిలో 30 బ్యాచ్‌ల్లో సుమారు 800 మంది కూలీలు వచ్చినట్లు వారికి పని కల్పిస్తున్న మధ్యవర్తులు తెలుపుతున్నారు. దువ్వూరుతోపాటు చాపాడు, మైదుకూరు, ఖాజీపేట, రాజుపాళెం మండలాల్లో కూడా ఈ కూలీలే పని చేస్తున్నారు. సాదారణంగా వారు మరాఠి, బెంగాళి, హిందీ భాషలు మాట్లాడుతున్నారు. వరినాటే వలసకూలీలకు రైతులకు మధ్యవర్తులు అనుసంధానంగా వ్యవహరిస్తున్నారు.

సాగు ఖర్చు తగ్గుతోంది

వలస కూలీలతో నాట్లు వేయించడం వలన ఎకరాకు అయ్యే ఖర్చు వెయ్యి నుంచి రూ.1500 దాకా తగ్గుతోందని రైతులు అంటున్నారు. ఇదే కాకుండా పొలాల్లో నారు మోసుకోవడం, నాటే సమయంలో కాలిబాటలు ఏర్పడే విధంగా నాట్లు వేయడంతో రైతులకు భారం తగ్గుతోంది. ఈ తరహాలో వరి సాగు చేయడం వలన తెగుళ్ల తగ్గుతాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. వరి పిలకలు అధికంగా కట్టి దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు.

కోర్టు నూతన భవన నిర్మాణానికి సహకరించండి



చమర్తిని కలిసిన న్యాయవాది వినయ్

నందలూరు, సెప్టెంబరు2: (ఆంధ్రజ్యోతి) : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు నూతనభవన నిర్మాణానికి సహకరించాలని టీడీపీ రాజంపేటనియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజును కోరినట్లు న్యాయవాది వినయ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంతో చరిత్ర గల నందలూరు కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని నూతన కోర్టు భవనానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. అనంతరం రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి పదవి చేపట్టినందుకు చమర్తి జగన్ మోహన్‌రాజుకు శుభాకాంక్షలు తెలిపామన్నారు.

మంత్రి మండిపల్లిని కలిసిన ఎర్రగోళ్ల రెడ్డెయ్య

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన ఎర్రగోళ్ల రెడ్డెయ్య మంగళవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనను ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరల సుధాకర్ పాల్గొన్నారు.

వైఎస్‌కు ఘన నివాళి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం రైల్వేకోడూరులో ఉప మండలాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి గజమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు సీహెచ్ రమేష్‌బాబు, ముజీబ్, సుబ్బరామ రాజు, రవూఫ్, అన్వర్‌బాషా, కౌరెడ్డి సిద్ధయ్య, నందబాల, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించాలి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ మొక్కలు నాటారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌ను ప్రిన్సిపాల్ డీఆర్ హరిత, స్థానిక టీడీపీ నాయకులు నాగినేని రమేష్ నాయుడు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటి పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఒంటిమిట్ట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుజాతమ్మ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తాము చేసిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తారన్నారు.

పడకేసిన పల్లెలు

- విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు
- ఒళ్లునొప్పులు, నీరసంతో బాధపడుతున్న ప్రజలు



కోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బారులు తీరిన రోగులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వాతావరణం మారడంతో వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి. దీంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.... పది రోజులుగా రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామాల్లో అపరిశుభ్రత అధికమై దోమల బెడద పెరిగిపోయింది. దీనికితోడు దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరాలు వ్యాపిస్తుండడంతో స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నా ఆస్పత్రికి వెళుతున్నారు. జ్వరం తగ్గని వారు తిరుపతిలోని ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనావాసాల్లో పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు, అన్ని మండలాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యాన్ని పరిరక్షించాలి



గ్రామాల్లో పారిశుధ్యాన్ని పరిరక్షించాలి. అపరిశుభ్ర పరిసరాల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

- కుంచా సుబ్రహ్మణ్యం, సింగిరివారిపల్లె

జ్వరాలొస్తున్నాయి



అంకమ్మనగర్ వద్ద మురుగు కాలువలు కంపుకొడుతున్నాయి. చిన్నలు, పెద్దలు జ్వరాల బారిపడుతున్నారు. వైరల్ ఫీవర్లు అధికం కావడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు.

- యెలిశెట్టి మణి, రైల్వేకోడూరు

పరిసరాలు శుభ్రంగా ఉండాలి



వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్ల పరిసరాల్లో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి..

- సాయి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



దీప బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానం కావాలని, సేవ్ లైఫ్ బై గివింగ్ బ్లడ్ అనే నినాదంతో రాష్ట్రంలోని యువత రక్తదానానికి ముందుకు రావాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాయచోటి పట్టణంలోని దీప బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రక్తదానం మహోత్తరమైన దానమని, ప్రతి రక్తపు బిందువు అనేక మంది ప్రాణాలను కాపాడుతుందని, సరైన సమయంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పవన్‌కల్యాణ్ అభిమానులతో పాటు కూటమి ప్రభుత్వంలోని ప్రతి కార్యకర్త, ప్రజలు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు పఠాన్ మహమ్మద్‌అలీ, టీడీపీ పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి, టీడీపీ నాయకులు షేక్. అతావుల్లా, శివారెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చిన్నమండెం: బోరెడ్డిగారిపల్లెలోని స్వగృహంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెలో మాజీ ఎంపీపీ రంగారెడ్డి కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ముగిరెడ్డెప్ప, విజయరెడ్డి, సుదర్శన్, రమేశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్, సుధా తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన సుగవాసి ప్రసాద్‌బాబు



మంత్రి లోకేశ్‌తో సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాబును మంగళవారం కడప నగరంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాతో పాటు రాయచోటి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పలు రాజకీయ అంశాలపై మాటాడారు. ఈ కార్యక్రమంలో టీడీ పీ పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానంపై అవగాహన ర్యాలీ



నేత్రదానంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పుల్లంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం పుల్లంపేటలో నేత్ర వైద్యుడు డాక్టర్ ఓబులేశు, పీహెచ్‌సీ డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గత నెల 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న 40వ జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బందికి నేత్రదానంపై అవగాహన కల్పించారు. నేత్రదానం చేయండి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించండి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.శ్రీనిజ, సీహెచ్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



రైతుల సమస్యలు వింటున్న కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని కుడా చైర్మన్ కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మంగళవారం కూటమి నాయకులతో కలిసి మండలంలోని కుక్కలదొడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ సమస్యలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముక్కా మాట్లాడుతూ అతి త్వరలో కుక్కలదొడ్డి గ్రామంలో అభివృద్ధి ఎలా ఉంటుందో చూసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలు, విద్యుత్ సమస్యలను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్టాన్ మౌలా(అల్లాభకష్), తల్లెం రమణరెడ్డి, గిరి నాయుడు, పోకూరి శివయ్య, సీనియర్ నాయకులు నీలకంఠయ్య, కోడూరు వార్డు సభ్యులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాతరాయచోటి దర్గాలో ఉరుసు



జమాలుల్లా బాబా దర్గా

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతరాయచోటిలో ఉన్న హజరత్ జమాలుల్లా బాబా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 4నుంచి ప్రారంభం కానున్నాయి. 4వ తేదీ గురువారం గంధం ఊరేగింపు, 5వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం దర్గా ఆవరణలో అన్నదానం, సాయంత్రం ఉరుసు, 6వ తేదీ శనివారం తహలీల్ ఫాతెహాతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు తెలియజేశారు.

పాఠశాల క్లస్టర్ వ్యవస్థను బలోపేతం చేయాలి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలంటే క్లస్టర్ పాఠశాల విధానాన్ని మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్య కత ఎంతో ఉందని నోబెల్ టీ చర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు కొండూరు శ్రీనివాసరాజు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. మంగళవారం ఆయన వైఎస్ఆర్ కడప జిల్లా పర్యటనకు విచ్చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామ కృష్ణంరాజు, సంఘ నాయకులు ఉపాధ్యాయ సమస్యలను వివరించారు. క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డీడీవో అధికారాలు ఇవ్వడంతో పాటు, క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలపై అకడమిక్, పరిపాలన బాధ్యతలు ఇచ్చినప్పుడే పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

బ్రిడ్జి నిర్మించాలని వినతి

సిద్దవటం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జ్యోతి-ఖాదర్ బంగ్లా మార్గంలో వంతెన నిర్మించాలంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించినట్లు మండల టీడీపీ నేత శనివారపు మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం కడప జిల్లాకు విచ్చేసిన మంత్రికి ఈ మేరకు వినతిపత్రం సమర్పించినట్లు వివరించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మాచుపల్లె సమీపంలో బ్రిడ్జి నిర్మిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వచ్చే ఏడాది పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్‌నాయుడు తదితర నేతలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ చెన్నారెడ్డి

రామాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజా చైతన్య సేవా సంస్థ సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ గడికోట చెన్నారెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ప్రజా చైతన్య సేవా సంఘం రాయచోటి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో మంగళవారం హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వినోద్‌కుమార్, దివ్యశ్రీ, సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఎంపీహెచ్‌ఎస్‌ఎఫ్, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రచారం అవసరం



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మాట్లాడుతున్న జయరామయ్య

రామాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని లక్కిరెడ్డిపల్లె సబ్‌యూనిట్ అధికారి జయరామయ్య అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది విస్తృతంగా పర్యటించి వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా స్క్రబ్ టైపు ఫీవర్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ దివ్యశ్రీ, రేఖానాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, క్రిస్టఫర్ ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి మహాసభలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రతి గ్రామ పంచాయతీలో మహాసభలు నిర్వహించనున్నట్లు ఏరియా కోఆర్డినేటర్, ఏపీఎం మల్లికార్జునరాజు తెలిపారు. మండల పరిధిలోని గాదెల, చెన్నరాజుపోడు గ్రామ పంచాయతీల్లో మంగళవారం డ్వాక్రా సంఘ మహిళల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళల బలోపేతానికి స్త్రీనిధి ఉన్నతి లోన్లతో పాటు, వ్యక్తిగత రుణాలను ఇప్పించి ఆర్థికంగా బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. రుణాలు సక్రమంగా చెల్లిస్తే సంఘం బలంగా ఉంటుందన్నారు. బయోమెట్రిక్, ఎంఆర్‌ఎస్ ద్వారా లోన్లు ఇస్తుండడంతో సంఘ సభ్యులందరూ అందుబాటులో ఉండాలని తెలిపారు. గాదెలలో సీసీ దామోదర్, చెన్నరాజుపోడులో సీసీ గోవిందమ్మ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు.

ప్రమాదాల నివారణకు

బెటాలియన్ పోలీసుల చర్యలు

సిద్దవటం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాకరాపేట, సిద్దవటం ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుపై రక్షణ గోడ లేక పోవడంతో ప్రమాదాలు అరికట్టేందుకు పోలీసు బెటాలియన్ సిబ్బంది ప్రమాద సంకేతంగా సేఫ్టీ బ్యారియర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి మంగళవారం మాట్లాడుతూ కల్వర్టు వద్ద ప్రమాదాలు అరికట్టేందుకు తాత్కాలికంగా పోలీసు బారిగేట్ టేప్ రోల్స్ ఏర్పాటు చేశామని, ఆర్ అండ్ బి అధికారులకు సమస్య వివరించగా ప్రమాదాలు అరికట్టేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు వివరించారు ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జన సేనానితో పనిచేయడం పూర్వజన్మ సుకృతం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్



చిట్వేలి: రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్



నందలూరు: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అతికారి కృష్ణ



రామాపురం: వృద్ధులకు అన్నదానం చేస్తున్న పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి

చిట్వేలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం ప్రజాసేవకోసం తపించే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో పని చేయడం తన పూర్వజన్మసుకృతమని రైల్వేకోడూరు ఎమ్మె ల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అన్నారు. పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా చిట్వేలిలో మంగళవారం జనసేన నాయకులు మాదాసు నరసింహ, మండల జనసేన నాయకుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆర్‌కే కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి ముక్కా రూపానందరెడ్డి పాల్గొన్నారు. ముందుగా మూల రోడ్డు నుంచి బైకు ర్యాలీ నిర్వహించారు. కల్యాణమండపం ప్రాంగణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 130 మంది అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం నియోజకవర్గంలోని ఆదర్శ రైతులకు రూ.10 వేలు, పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపించిన విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేల చెక్కులను పంపిణీ చేశారు. 55 మంది పారిశుధ్య కార్మికులకు, గిరిజన మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలయికతో ఆంధ్రుల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అన్నదానం చేశారు. రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: జనసేననాయకులు, కార్యకర్తలు అభిమానులు, భారీ కేక్‌ను స్థానిక బస్టాండు నుంచి గాంధీ విగ్రహం వరకు ఊరేగించి కట్ చేసిపంచిపెట్టారు. పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. నార్జాల దాశరథి, నల్లంశెట్టి యానాదయ్య, ముద్దపోలు సభాపతి తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం/ ఒంటిమిట్ట/ నందలూరు: జనసేనపార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో సిద్దవటం బస్టాండు కూడలిలో, ఒంటిమిట్ట రామాలయం వెనుక, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని ఆర్ అండ్ బీబంగ్లా వద్ద కేక్ కట్ చేశారు సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు నందలూరు లో పారిశుధ్య కార్మికులకు చీరలు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు.

రాజంపేట టౌన్ : పట్టణంలోని భువనగిరిపల్లె ఆర్చి సమీపం నుంచి మన్నూరు పార్టీ కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండు కూడలిలో అన్న దానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. జనసేనపార్టీ నాయకులు కేఎస్ నరసింహ, లక్ష్మీ నరసయ్య, కొరముట్ల హరి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ కార్యాల యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరా లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రజాసేవకు నిరంతరం కృషి చేస్తున్న మన డిప్యూటీ సీఎం ఆయురారోగ్యాలతో కలిగి ఉండి రాష్ట్ర అభివృద్ధిలో తనవంతు పాత్ర నిర్వహించాలని కోరారు.

సుండుపల్లె: సీనియర్ నాయకుడు రామాశ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. పంచాయతీ కార్మికులు, మహిళలకు, జనసేన వీర మహిళ రెడ్డిరాణి చీరలు పంపిణీ చేశారు.

రామాపురం: మండల పరిధిలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో జనసేన నాయకుడు పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో జనసేనపార్టీ ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు నాగినేని రమేష్ నాయుడు, జనసేన రాయలసీమ కన్వీనర్ జోగినేని మణి ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు. రక్తదాతలకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చేతులమీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

వీరబల్లి: ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గుగ్గిళ్ల వెంకటేశ్, సాయిరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి పవిత్రోత్సవాలకు మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో 2 నుంచి 5వ తేది వరకు ప్రసన్న వేంకటరమణస్వామి పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను ముఖ మండపంలో ఉంచి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి టీటీడీ ఆగమ సలహాదారు మణికంఠ భట్టర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్, ఉప అర్చకులు రమేష్‌బాబు స్వామి శ్రీవారికి భగవతారాధన నిర్వహించి అనంతరం పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. బుధవారం ఉదయం చతుష్టానార్చనం, పవిత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, స్నపన తిరుమంజనం, సాయంత్రం చతుష్టానార్చన హోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నగేష్, భక్తులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ


రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ చాటిన మదనపల్లె విద్యార్థులు


మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రోప్ స్కిప్పింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపారు. నంద్యాల జిల్లా డోన్‌లో ఆగస్టు 31న నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. మదనపల్లె పట్టణం, నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.తేజేశ్వర్ (డబుల్ అండర్ ద్వితీయ), శిరీష్‌కుమార్ (హెచ్‌వోపీ ద్వితీయ), స్పీడ్ స్ప్రింట్‌లో తృతీయ స్థానంలో గెలుపొందారు. వీరిని పీడీ లత, హెచ్‌ఎం శ్రీనప్ప అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీకుమార్, శ్రీబాబు, పద్మజ, మధుమతి, లలితకుమారి, మాధవి, పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము రికవరీ


ఎంపీడీఓకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న దృశ్యం

కురబలకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా ప్రభుత్వం పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ సొమ్మును పూర్తిగా రికవరీ చేసినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. ఎంపీడీఓ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంగళ్లు పంచాయతీ జోగివారిపల్లెకు చెందిన వెంకటరమణ తెట్టు సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తెట్టు పంచాయతీ పరిధి హరిజనవాడలో లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన సొమ్మును ఇవ్వకుండానే పరారైన విషయం తెలిసిందే. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామప్ప ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా ఉద్యోగి తండ్రి శ్రీనివాసులు సోమవారం రూ.3లక్షలు ఎంపీడీఓకు అందజేయగా, మిగిలిన సొమ్మును మంగళవారం అందజేశారు. దీంతో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

కుదువకు పేదల గూడు



- చెరబడుతున్న ప్రైవేటు ఫైనాన్స్‌లు
- అప్పులు తీర్చుకోవడం కోసం వడ్డీల ఊబిలోకి..
- చాపకింద నీరులా పల్లెలకు పాకుతున్న జాడ్యం

బి.కొత్తకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అవును.. తలదాచుకునేందుకు కట్టుకున్న గూడు.. ఆత్మాభిమానానికి, సమాజంలో మదింపునకు తార్కాణంగా నిలిచే నివాసం.. ఆస్తిపై రుణం ముసుగులో కుదవకు వెళతోంది. అప్పులు తీర్చుకోవచ్చనే ఆశతో కార్మికులు, రైతులు ఆత్మాభిమానాన్ని ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులకు తాకట్టుపెడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక సమస్యలు వచ్చినపుడు అప్పులు చేస్తారు. ఇంట్లోని బంగారు కుదువకు పెడతారు. ఇంకా అంటే పరువు పోకుండా భూములు మార్టిగేజ్(చూపుడాయకం)చేసి అప్పు తీసుకుంటారు. ఇది అంతకంటే ఘోరం... పెళ్లాం పిల్లలతో కలిసి ఉంటున్న ఇంటినే ఆయకం పెట్టే క్రమంలో ఫైనాన్స్ సిబ్బంది చేష్టలతో జరిగే అవమానం ఒక ఎత్తు అయితే, నెలవారీ కంతులు కట్టలేని పరిస్థితిలో వాళ్లు చేసే అవమానకర పనులతో రుణదాతలు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. మదనపల్లె, బి.కొత్తకోట కేంద్రాలుగా పనిచేస్తున్న ఈ ప్రైవేటు బ్యాంకుల ఉచ్చులో వేల కుటుంబాలు చిక్కుకొని విలవిలలాడుతున్నాయి.

చిన్నచిన్న అప్పులు తీర్చడం కోసం.. పెద్దఅప్పు

బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు మండలాలతో పాటు సత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో సైతం ప్రతి పల్లెలో పదులసంఖ్యలో కుటుంబాలు తమ ఇళ్లను తాకట్టుపెట్టి ఒక్కొక్కరు రూ.4లక్షల నుంచి రూ.7 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు.




బి.కొత్తకోట మండలంలో ఓ ఇంటి ముందు రాసిన నోటీసు

అప్పులలో కూరుకుపోయి బాధలు పడుతున్న వారికి ఈ ఫైనాన్స్ బ్యాంకులు ఊరిస్తున్నాయి. ఒకరిని చూసి మరొకరు వీటిపట్ల ఆకర్షితులవుతూ ఇళ్లను తాకట్టుపెట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఉదాహరణకు వెంకట్రమణ టైలర్ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటిపని చేయడానికి, కొడుకు చదువుకు అప్పులు చేశాడు, డైలీ, వీక్లీ కలెక్షన్‌లకు తీసుకున్నాడు. ఈ కలెక్షన్లు, వడ్డీలు, చీటీలు కట్టలేక దిక్కుతోచని స్థితిలో తాను కొత్తగా నిర్మించిన ఇంటిని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌కు కుదవపెట్టి రూ.7.60లక్షలు తీసుకున్నాడు. అంతా అప్పులకే సరిపోయింది. తీరా ఆ ఫైనాన్స్ వడ్డీరేటు చూస్తే దిమ్మతిరిగింది. నెలవారీ కంతులు ఏకంగా ఎనిమిది సంవత్సరాలు చెల్లిస్తేకానీ అప్పు తీరదు.

రిజిస్ట్రేషన్ అవుతుందనే ఆశతో..

గ్రామాలలో చాలామందికి తాము ఉంటున్న ఇళ్లకు ఎటువంటి పట్టా, రిజిస్ట్రేషన్ ఉండదు. చాలావరకు గ్రామకంఠం వుంటుంది. అలాంటి వారికి వీరు గాలం వేస్తారు. వీఆర్వో దగ్గర సంతకం పెట్టిస్తే భార్యకు గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించి, భార్య దగ్గర నుంచి ఫైనాన్స్ కంపెనీ పేరిట మార్టిగేజ్ చేసుకుంటారు. ఇందుకయ్యే ఖర్చంతా కుటుంబీకులే భరించాలి. అప్పూ దొరుకుతుంది, ఇల్లు రిజిస్టర్ అవుతుందన్న ఆశతో పేదలు వీరి బుట్టలో పడి, రుణాలు తీసుకొని అధిక వడ్డీలతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.



వీఆర్వో రాసిచ్చిన సర్టిఫికెట్

రుణాల వసూళ్లు మరీ ఘోరం

ఈ ఫైనాన్స్‌ల వద్ద అప్పులు తీసుకున్న వారికి టార్చర్ మామూలుగా వుండదు. నిత్యం ఫోన్‌లో వేధింపులు. ఒక్క నెల కట్టకపోయినా చక్రవడ్డీ పడుతుంది. మూడు నెలలు కట్టకపోతే లాయర్ నోటీసు వస్తుంది. ఇంటిపై అప్పు ఉన్నట్లు ఇంటి ముందు గోడకు బోర్డు రాస్తారు. అప్పటికీ కట్టకపోతే కోర్టు, పోలీసుల ద్వారా ఇంటిని సీజ్ చేయిస్తారు. ఊరిలో చాటింపు వేయించి మరీ రుణగ్రస్తుడి ఇంటిని జప్తు చేసి వేలం వేస్తారు. కార్మికులు, సన్నకారు రైతులకు రెగ్యులర్‌గా ఆదాయం ఉండదు. దీంతో వాయిదా పైకం చెల్లించలేక సిబ్బంది చేసే అవమానాలు భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆ ఊబిలోంచి బయట పడలేక లబోదిబోమనే కుటుంబాలు పల్లెలలో పెద్దసంఖ్యలో దర్శనమిస్తున్నాయి.

రుణం ఇవ్వకుండానే పరువు తీసే సిబ్బంది..

ఈ ఫైనాన్స్ కంపెనీ ద్వారా రుణం తీసుకునే కుటుంబానికి ఆదిలోనే సగం పరువు పోతోంది. మార్టిగేజ్ చేయబోయే ఇంటి వద్దకొచ్చి కొలతలు వేస్తారు. నాలుగు దిక్కుల నుంచి ఫోటోలు తీస్తారు. ష్యూరిటీ ఇచ్చే వ్యక్తి ఇంటినీ ఫోటోలు తీస్తారు. పరిశీలన పేరుతో ఒకటికి నాలుగుసార్లు వచ్చి ఊరంతా ఆ కుటంబం గురించి ఆరా తీస్తారు. ఈ ఇల్లు తాకట్టుకు పోతోందని సగం ఊరికి అప్పటికే తెలిసేలా చేస్తారు. దీంతో అప్పటిదాకా కాపాడుకున్న పరువు కాస్తా పోతుంది.

కోటగంగమ్మకు జ్యోతులు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్లెల గ్రామంలో మంగళవారం మహిళలు కోటగంగమ్మకు జ్యోతులను మోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వినాయక చవితి అయిపోయిన మరుసటి రోజు గ్రామదేవతల్లో ఒకరైన కోట గంగమ్మకు ఆనవాయితీగా మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులను సమర్పించి ఇంటింటికీ బోనాలు పెట్టి, జంతుబలులు సమర్పించి మొక్కుబడులను తీర్చుకుంటారు. రాత్రి గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామంలో మేళతాళాలు మంగళ వాయిద్యాలు కోలాటలు, చెక్కభజనలు, బళ్లారి డ్రమ్ములతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.


కోట గంగమ్మకు సమర్పించేందుకు పెద్ద ఎత్తున జ్యోతులను తీసుకెళుతున్న మహిళలు

వాటర్ షెడ్ల ద్వారా నీటి నిల్వ : పీడీ


వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న పీడీ

పెద్దమండ్యం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జలాలు పెంపొందించడానికే వాటర్ షెడ్ల ద్వారా నీటి నిల్వ అభివృద్ధి పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. మండలంలో పీడీ పర్యటించారు. సి.గొల్లపల్లి, గుర్రంవాండ్లపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న మైక్రో వాటర్‌షెడ్ల అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్‌షెడ్ పథకం ద్వారా జరుగుతున్న పనులపై ఆయా సిబ్బందితో సమీక్షించారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి వాటర్‌షెడ్లు దోహదపడాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా వాటర్ షెడ్ల నిర్మాణాలు జరగాలని, బాధ్యతగా పని చేయాలన్నారు. సిబ్బందికి కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్వామా ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, వాటర్‌షెడ్ పీఓ రవీంద్రుడు, ఉపాధి ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది శివయ్య, మోహన్ వాటర్‌షెడ్ల చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంపై అవగాహన

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) అధ్వర్యంలో తుమ్మరకుంటలో మంగళవారం రైతులకు పట్టుపురుగుల పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సిరికల్చర్ (ఏడీ) రామమోహన్ రైతులతో మాట్లాడుతూ పట్టు పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టుసాగుకు చేయూతనందిస్తోందని రైతులు పట్టుసాగు, మల్బరీ తోటల పెంపకం పట్టుపురుగులను పెంచుకునేందుకు షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించారు. పట్టుసాగుతో రైతులకు ఒనగూరే లాభాలు, మల్బరి తోటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ మార్గాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పట్టు గూళ్లను మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, కోటవీధికి చెందిన నాగరాజు (41) కార్పెంటర్‌గా పనిచేస్తుండేవాడు. 20 ఏళ్ల క్రితం మదనపల్లె పట్టణం రామారావుకాలనీకి చెందిన వనితతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం జరిగిన ఐదేళ్ల తరువాత విడిపోయి వేరువేరుగా ఉంటున్నారు. కాగా నాగరాజు మద్యానికి బానిసై ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండేవాడు. తల్లిని, భార్యను వదిలి విడిగా ఉండడంతో ఎవ్వరూ పట్టించుకునే వారు కాదు. కాగా సోమవారం మధ్యాహ్నం బసినికొండ సమీపంలో ఉరేసుకుని మృతి చెందాడు. మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో తల్లి లతను పోలీసులు విచారించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో దూడ...


కుక్కల దాడిలో మృతి చెందిన దూడ

రామసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతలపేటలో వీధి కుక్కలు దాడి చేసి లేగ దూడను చంపేశాయి. గ్రామానికి చెందిన కుమార్‌కు రెండు ఆవులు ఉన్నాయి. వాటిలో ఒక లేగదూడ ఉంది. వీటిని తన వ్యవసాయ పొలంలో మేత కోసం వదలగా లేగ దూడపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. జీవనోపాధికి పెంచుకున్న దూడ మృతితో రైతు కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వీధి కుక్కలతో మనుషులే కాకుండా మూగ జీవాలు సైతం దాడికి గురవుతున్నాయని, కుక్కల దాడులను అరికట్టడానికి ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టైల్స్ షాపు యజమాని ఆత్మహత్యాయత్నం


సెల్ఫీ వీడియోలో దామోదర్‌రెడ్డి

రాజంపేటటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ టైల్స్ షాపు యజమాని సెల్ఫీ వీడియో తీసు కుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. రాజంపేట పట్టణంలోని మన్నూరు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న వైష్ణవి టైల్స్ షాపు యజమాని దామోదరరెడ్డి మంగళవారం ఉదయం వీడియో రికార్డింగ్ చేస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఇది గమనించిన స్నేహితులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దాయాదుల ఘర్షణ - కేసు నమోదు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై ఘర్షణ పడి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బండ్లపై గ్రామం హరిజనవాడకు చెందిన మేకల రెడ్డెప్ప వీఆర్‌వోగా చౌడేపల్లిలో పనిచేస్తున్నాడు. అయితే అతనికి తాతల నుంచి కొంత భూమి సక్రమించింది. సదరు భూమి విషయమై దాయాదులతో కుదరక కోర్టులో కేసులు వేసుకొని కేసు నడుస్తోందని తెలిపారు. అయితే కోర్టులో వున్న భూమిని దాయాదులు సరిహద్దులు చెరిపేస్తూ వారి భూమిలో కలుపుకోవాలని చూశారు. ఇంతలో భూమి వద్దకు వెళ్లిన మేకల రెడ్డెప్ప, తన భార్య వనజలను దాయాదులు నాగరాజు, అతని అన్న కుమారుడు ఖదిరిపతి, అతని చెల్లెలు రాధా, తమ్ముడి భార్య సౌజన్యలు భూమి సరిహద్దు చెరిపేయడమే కాకుండా తమను నానా భూతులు తిట్టి కర్రలతో గాయపరిచినట్లు తెలిపారు. దీంతో రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మండలంలోని కాప్పల్లె పంచాయతీ గుట్టవారి పల్లె గ్రామానికి చెందిన శ్రుతి(21) మదనపల్లెలో జ్ఞానాంబిక కళాశాలలో చదువుతోంది. గత నెల 30న ఉదయం కళాశాలకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంగళ్లు భూవివాదంలో..

పోలీసుల పంచాయితీ


అంగళ్లులోని వివాదాస్పద భూమి

- రాజీకి బాధితులపై ఒత్తిడి
- అప్పటి వైసీపీ వాళ్లే నేటి టీడీపీ

మదనపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కబ్జాలు, భూ వివాదాలకు నిలయమైన కురబలకోట మండలం అంగళ్లులో అటు స్థానికులు, ఇటు నాయకులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎవరు ఎప్పుడు భూమిలోకి ప్రవేశించి పనులు చేపడతారో అన్నదే వారి భయం. అప్పటి వైసీపీ పాలనలో జరిగిన సంఘటనలే ప్రస్తుతం పునరావృతమవుతున్నాయి. అంగళ్లు రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 220 అంటేనే అది వివాదాల సుడిగుండమని అందరికీ తెలుసు. సర్వేనంబర్ 220లో మొత్తం 69.42 ఎకరాలు కాగా, అందులో 220-1, 2, 3, 4 సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఇందులో హక్కులపై 2017 నుంచీ వివాదం జరుగుతోంది. ఒక సబ్‌డివిజన్‌లో హక్కు ఉంటే, మరో నంబర్‌లోకి ప్రవేశించడం, వివాదం సృష్టించడం, హక్కు లేని వారూ రంగప్రవేశం చేయడం, అమ్మినభూమినే మరొకరికి విక్రయించడం, తదితర కారణాలతో వివాదం ముదిరి పాకానపడింది. ఇందులో రాజకీయ నాయకులు, పోలీసుల రంగప్రవేశం చేయడం, రాజీ కుదుర్చడం షరామామూలైంది. ఈ క్రమంలో అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని 2021లో పులివెందుల బ్యాచ్ రంగప్రవేశం భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. తర్వాత కడప బ్యాచ్, ఆ తర్వాత తిరుపతి, దాని తర్వాత తంబళ్లపల్లె బ్యాచ్ ఇలా రోజులు గడిచే కొద్దీ హక్కుదారులు మారతారు.. కొత్తగా రాజకీయ నాయకులు ప్రవేశిస్తుంటారు. ఈ క్రమంలో వైసీపీ కబ్జాదారులు కొందరు పెద్దనాయకుల అనుచరుల పేరుతో బాధితుల నుంచి రాజీ పేరుతో అక్కడ కొంత భూమిని కూడా రాయించుకున్నారు. మళ్లీ కొన్నాళ్లకు మామూలే అన్నట్లు మరొకరు రంగ ప్రవేశం చేయడం ఇప్పటికే చేపట్టిన ఫెన్సింగ్‌ను రాత్రికి రాత్రే కూల్చేయడంతో వివాదం మొదలవుతోంది. ఇందులో గూడుకోసం ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన పేద, మధ్యతరగతి ప్రజలు బాధితులుగా మారుతున్నారు. పదిరోజుల క్రితం మరోసారి వివాదం జరగడం, సర్వే పేరుతో పోలీసులు, రాజకీయ నాయకుల ప్రవేశంతో అంగళ్లు మరోసారి ఉక్కిరిబిక్కిరి అయింది. ఇక అంతే అప్పటి నుంచీ పోలీసులు ప్రవేశించినట్లు స్థానికులు చెబుతున్నారు. నిత్యం బాధితులను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి పంచాయితీ పెడుతున్నట్లు వాపోతున్నారు. అప్పుడు వైసీపీలో ఉన్నవాళ్లే ఇప్పుడు టీడీపీ పేరుతో అంగళ్లు భూమి పంచాయితీలో ప్రవేశిస్తున్నారు. అప్పట్లో మధ్యవర్తిగా ఉంటూ వైసీపీ నాయకుల పేరున భూమి రాయించిన వారే.. తిరిగీ తాము టీడీపీ అంటూ రంగప్రవేశం చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఇక్కడ హక్కుదారులు, బాధితులు కాకుండా సంబంధం లేని వారు పోలీసులను ఆశ్రయించి పంచాయితీ పెట్టినట్లు చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీ నేతలకు రాయించిన భూమిని తిరిగీ రాయిస్తామని, మిగిలిన భూమిని కూడా తమపేరుతో రాయించాలని స్టేషన్‌లో పంచాయితీ పెట్టి బాధితులపై ఒత్తిడి చేస్తున్నారు. అయితే ఆ భూమి ప్రస్తుతం కోర్టు కేసులు, క్రిమినల్ కేసులు ఉండటంతో రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఇక్కడ ఇప్పటికీ వైసీపీ పాలనే నడుస్తోందని బాధితులు వాపోతున్నారు.

డీఎస్పీ ఏమన్నారంటే

అంగళ్లు వివాదంలో పోలీసుల జోక్యంపై స్థానిక డీఎస్పీ మహేందర్‌ను వివరణ కోరగా.. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోరాదని, అంగళ్లు భూ వివాదంలో పోలీసులు పంచాయతీలు చేస్తున్నట్లు తెలిస్తే, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్థానికులకు టోల్‌గేట్ వసూలు చేయొద్దు

- తుమ్మనంగుట్ట టోల్‌గేట్ వద్ద స్థానికుల నిరసన


టోల్‌గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ములకలచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిపై కొత్తగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్ ఎదుట మంగళవారం స్థానికులు నిరసనకు దిగారు. టోల్‌గేట్‌లో స్థానికులకు మినహాయింపు ఉన్నా టోల్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తుమ్మనంగుట్ట టోల్‌గేట్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టి అనంతరం మాట్లాడుతూ టోల్‌గేట్‌కు ఇరువైపులా ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగించే సమయంలో టోల్ వసూలు చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బురకాయల కోట నుంచి రెండు కి.మీ. దూరంలో ఉన్న తుమ్మనంగుట్ట, గోళ్లపల్లె వెళ్లి వచ్చే టమోటా వాహనాలకు, పాలబండ్లకు రెండు సార్లు టోల్ వసూలు చేస్తున్నారన్నారు. కురబలకోట మండలం ముదివేడు వద్దనున్న టోల్‌గేట్ వద్ద స్థానికులకు టోల్ వసూలు చేయడం లేదని, ఇక్కడ మాత్రం వసూలు చేస్తూ ఇబ్బందులు పెడుతుండడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని స్థానిక వాహనాలకు టోల్ లేకుండా పాసులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, నేతలు గోపాల్‌రెడ్డి, విజయ్ కుమార్, అనిల్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, మౌలాలి, పుల్లప్ప, చాంద్‌బాషా, బావాజీ, మస్తాన్, పూల శ్రీధర్, కేశవ, వుత్తపాండే తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం.. మంత్రి లోకేశ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన మంత్రి సవిత, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి

సీకేదిన్నె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. స్థానిక సభాప్రాంగణం వద్ద మధ్యాహ్నం కమలాపురం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ అందరం ఒక కూటమి సభ్యులుగా పనిచేయాలని.. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా.. భయపడాల్సిన అవసరం లేదని నేరుగా తెలియజేస్తే వారికి అండగా ఉంటామన్నారు. మేము కూడా కొన్ని తప్పులు చేస్తుంటామని... ఎత్తిచూపితే పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లినవారికి మంచి గుర్తింపు ఇవ్వడంతోపాటు తగిన పదవులు ఇస్తామన్నారు. ఈనెలాఖరు వరకు అన్నిస్థాయిల్లో కమిటీలు పూర్తిచేస్తామన్నారు. జగన్‌ను కలవడానికి ఇప్పుడు కూడా వీఐపీ పాస్ కావాలంటున్నారని.. అహంకారంతో కాదు, ప్రజల మనస్సు ప్రేమతో గెలువాలని అప్పుడే వారికి దగ్గరవుతామన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు అయిదేళ్లు సమర్థవంతంగా నిర్వహించడం... నాయకులు, కార్యకర్తలు కష్టం ఫలితంగా 2024లోఘన విజయం సాధించామన్నారు. పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలని.. ప్రజల చుట్టూ మీరు తిరిగితే.. పార్టీ నీ చుట్టూ తిరుగుతుందన్నారు. సిఫార్సుల ద్వారా పదవులు రావని, పనితీరు ద్వారా మాత్రమే గుర్తింపు వస్తుందన్నారు.పార్టీ సభ్యత్వం, సుపరిపాలన, తొలి అడుగు తదితర కార్యక్రమాలను బాగా అమలు చేసి వారిని గుర్తించడం జరిగిందన్నారు. పార్టీ పదవులు కూడా క్రియాశీలకంగా పనిచేసిన వారికే అందిస్తామన్నారు. ప్రతిచోట కార్యకర్తలకు సమయం కేటాయించి వారి సమస్యలుతెలుసుకోవడం జరుగుతుందన్నారు. దాంతో పాటు వారితో కలిసి ఫోటోలు దిగడం జరుగుతుందన్నారు.

ప్రేమతో ప్రజల మనస్సు గెలువాలి

అహంకారంతో కాదు ప్రేమ, ఆప్యాయతలతో మనం ప్రజల మనస్సు గెలువాలని మంత్రి లోకేష్ తెలిపారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి. అహకారం లేకుండా బాధ్యతగామెలిగితే గతంలో ఎన్నడు లేని విధంగా కడప జిల్లాలో అధిక సీట్లు సాధించామన్నారు. ఓర్పు, సహనంతో రాజకీయం చేయడంతోనే ఇది సాధ్యమైందన్నారు. వైసీపీ వారు అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో విర్రవీగడంతో 151 సీట్లు 11 సీట్లు అయ్యాయన్నారు. కాగా, 2019-24 మధ్య తప్పుడు కేసులు ఎదుర్కొన్న కార్యకర్తలకు విముక్తి కలిగిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. అటువంటివారి వివరాలు తమ దృష్టికి తేవాలన్నారు.

94 మంది కార్యకర్తలకు అవార్డులు

కమలాపురం నియోజకవర్గంలో 94 మంది ఉత్తమ కార్యకర్తలను గుర్తించి మంత్రి లోకేష్ అవార్డులు అందజేశారు. ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తిస్తానని.. వారికి తగిన న్యాయం చేస్తానని తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలో చింతకొమ్మదిన్నె మండలం నుంచి ఎక్కువ మంది ఉత్తమ కార్యకర్తల అవార్డు అందుకున్నారు. వారందరిని మంత్రి లోకేశ్‌తో పాటు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న వారిలో టీవీ క్రిష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, శ్రీనివాసులరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దర్బార్‌బాష, శివశంకర్, జబివుల్లా, శివానందయాదవ్, బిట్టి ఆది, భద్ర, బ్రహ్మానందరెడ్డి, నంద, తదితరులు ఉన్నారు.

వినతులు స్వీకరణ

మంత్రి లోకేశ్ మంగళవారం ఉదయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరించడంతో పాటు వారితో ఫొటోలు దిగి సంతోషపరిచారు. ఆద్యంతం కార్యకర్తలకే అధిక సమయం కేటాయించడంపట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

మంత్రి పర్యటనను విజయవంతం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి అభినందనలు తెలిపారు. రాబోయే కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత పాటుపడుతానని మంత్రి లోకేష్ తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి నుంచి ఉత్తమ కార్యకర్త అవార్డులు అందుకుంటున్న కార్యకర్తలు

సులువైన ఆటో ప్రయాణం కోసం..

● ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఆటోమ్యాట్ యాప్ రూపకల్పన



ఆటోమ్యాట్ అప్లికేషన్ తయారుచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన డైరెక్టర్ కుమారస్వామి గుప్త, తదితరులు

వేంపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సొంత ఆలోచనతో ఆటోమ్యాట్ యాప్‌ను రూపొందించారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో యాప్ పనితీరు గురించి విద్యార్థులు శివశంకర్, సాయినాథ్, రవితేజ, అంకిత్, సాయికుమార్‌లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆటోలు అందుబాటులో ఉండడం, నిజమైన పారదర్శకమైన ధరల విధానం, విద్యార్థుల భద్రత, ఆటో డ్రైవర్ల ప్రవర్తన, అధికచార్జీలు, ఫిర్యాదులు వంటి ఆప్షన్లు ఈ యాప్‌లో ఉంటాయని, ఆటో డ్రైవర్ల మొబైల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్త మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అప్లికేషన్లు రూపొందించిన విద్యార్థులు అభినందనీయులన్నారు. ప్రయోగాలు చేసి సమాజానికి ఉపయోగపడే కొత్తకొత్త ప్రయోగాలు చేయాలని సూచించారు. అనంతరం విద్యా ర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ కైలాష్, హెచ్ఓడీ రత్నకుమారి, శరవన్ కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గండికోట నుంచి 10 వేల క్యూసెక్కులు విడుదల



గండికోట నుంచి మైలవరానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం మధాహ్నం నుంచి 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 10,700 క్యూసెక్కులు, వరద నీరు మరో 500 క్యూసెక్కులు వచ్చి చేరుతోందన్నారు. కాగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 23.473 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

డ్వామా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



మంత్రి లోకేశ్‌ను కలిసి విన్నవిస్తున్న జేఏసీ చైర్మన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (డ్వామా)లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్‌కు డ్వామా ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ కె.మునిశేఖర్‌రాజువినతి పత్రం సమర్పించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. అన్ని కేడర్ల వారికి గ్రేడ్ ఫిక్సేషన్ అమలు చేయడంతో పాటు అన్ని రకాల అలవెన్సులను బేసిక్‌తో కలిపి ఇవ్వాలని కోరారు. అదే విధంగా 2022 వేతన సవరణ ప్రకారం 23 శాతం వేతన పెంపును వెంటనే ఇవ్వాలని, మూడేళ్లు పూర్తయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికి ఎఫ్‌టీఈలుగా కన్వర్ట్ చేయాలని కోరారు. గత ఐదు సంవత్సరాల నుంచి అమలు చేయని అన్ని కేడర్ల వారికి కేరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసిని వెంటనే అమలు చేయాలని కోరారు. కేరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీలో భాగంగా పదోన్నతుల వారికి నష్టపోయిన ఇంక్రిమెంట్లను చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులను ఇప్పించాలని కోరారు.

పింఛన్ డబ్బులతో జూనియర్ లైన్‌మ్యాన్ పరారీ

● లబోదిబోమంటూ ఎంపీడీవో కార్యాలయానికి చేరిన వృద్ధులు ● పోలీసులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ సెక్రటరీ



నర్సాపురం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ సెక్రటరీ

కాశినాయన, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) కాశినాయన మండల కేంద్రమైన నర్సాపురం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మ్యాన్ దర్శి రాజశేఖర్ సెప్టెంబరు నెలకు సంబంధించి రూ.2,08,500 పింఛన్ డబ్బుతో కన్పించకుండా పోయాడని ఆ గ్రామ సచివాలయ పంచాయతీ సెక్రటరీ డి.సులోచన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ మూల పల్లె, పర్సనపల్లె గ్రామాలలో 63 మంది పింఛన్‌ల పంపిణీకి సంబంధించి రూ.2,86,500 ఇచ్చామన్నారు. సెప్టెంబరు 1 మధ్యాహ్నం వరకు 18 పింఛన్‌లకు రూ.78,000 పంచాడని.. ఆతర్వాత కన్పించకుండా పోయాడన్నారు. ఫోన్ చేసినా ఎత్తడం లేదన్నారు. అతనిపై అధికారులకు తెలియజేసి వారి ద్వారా ఫోన్ చేయించినా స్పందించలేదన్నారు. ప్రస్తుతం అతని వద్ద 45 పెన్షన్‌లకు సంబంధించి రూ.2,08,500 నగదు ఉందన్నారు. ఈవిషయం పైగ్రామాల వృద్ధులకు తెలియడంతో వారంతా లబోదిబోమంటూ మంగళవారం దాదాపు రెండు కి.మీ. నడుచుకుంటూ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఆరా తీశారు. అక్కడి అధికారులు పింఛన్ డబ్బు గురించి ఆందోళన చెందవద్దని.. ఇంటి వద్దకే వచ్చి ఇస్తారని సర్దిచెప్పడంతో వృద్ధులు వెనుదిరిగి పోయారు.

కుమారుడిపై తండ్రి దాడి

జమ్మలమడుగు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో కుమారుడిపై తండ్రి దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు... ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రమేష్‌బాబు రెండు సెంట్ల స్థలానికి సంబంధించి రిజిస్టర్ చేసి ఇవ్వాలని తన తండ్రి మారెన్నను కోరాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మారెన్న మచ్చుకత్తితో కుమారుడిపై దాడి చేశాడు. అదే సమయంలో అడ్డు వచ్చిన తల్లి యల్లమ్మపై దాడి చేశాడు. దీంతో తలకు గాయాలైన రమేష్‌బాబును జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణకు బెటాలియన్ పోలీసుల చర్యలు

సిద్దవటం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాకరాపేట, సిద్దవటం ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుపై రక్షణ గోడ లేక పోవడంతో ప్రమాదాలు అరికట్టేందుకు పోలీసు బెటాలియన్ సిబ్బంది ప్రమాద సంకేతంగా సేఫ్టీ బ్యారియర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి మంగళవారం మాట్లాడుతూ కల్వర్టు వద్ద ప్రమాదాలు అరికట్టేందుకు తాత్కాలికంగా పోలీసు బార్‌గేట్ టేప్ రోల్స్ ఏర్పాటు చేశామని, ఆర్అండ్‌బీ అధికారులకు సమస్య వివరించగా ప్రమాదాలు అరికట్టేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచన మేరకు ఎరువులు వాడాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు సూచిం చిన మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడాలని పులివెందుల ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం పులివెందులలోని అరటిపరిశోధన స్థానంలో పులివెందుల, ముద్దనూరు వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు విజ్ఞానయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం,వాటి ఉపయోగాలు, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, పురుగులు, తెగుళ్ల నివారణకు కషాలు వాటి ఉపయోగాలు వివరించారు.

పైపులు పీకేస్తే.. మా పొలాలకు నీరెలా..!

●అధికారులతో రైతుల వాగ్వాదం

చాపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామం వద్ద గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే మేనేజర్ సాయిరెడ్డి, సింహాచలంతో రైతులు మంగళవారం వాగ్వాదానికి దిగారు. ఆ గ్రామం వద్ద నేషనల్ హైవే నిర్మిస్తున్నారు. నెలన్నర రోజుల క్రితం రోడ్డుకు ఇరు వైపుల రైతుల పొలాలకు సాగునీరు పారేందుకు రోడ్డు అడుగు భాగంలో పైపులు నిర్మించారు. మంగళవారం పోలీసుల సహాయంతో వాటిని మళ్లీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పైపులు తొలగిస్తే తమ పొలాలకు సాగునీళ్లు అందవని రైతులు అడ్డుకున్నారు. వేరేచోట పైపులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పడంతో అక్కడ భూమి కన్నా ఎత్తుగా ఉండడంతో అనుకూలంగా లేవని రైతులు చెబు తున్నా.. వారి మాటలు వినకుండా అధికారులు పైపులను తొలగించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సౌమ్యనాథస్వామి ఆలయంలో పవిత్రాల ప్రతిష్ఠ



హోమం చేస్తున్న అర్చకులు, స్వామి వారికి పవిత్రాలు సమర్పించిన దృశ్యం

నందలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా పవిత్రాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలబోగము, పవిత్ర హోమం, బలిహరణ, శాత్తుమొర, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం పవిత్ర హోమం, నివేదన, శాత్తుమొర గోష్ఠి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సాయికృష్ణ, పలువురు అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 3న పవిత్రాల సమర్పణ, పవిత్ర హోమం, శాత్తుమొర, నివేదన, 4న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, మహానివేదన, పవిత్ర వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊరేగింపు నిర్వహిస్తారని తెలియజేశారు.

వరి నాట్లకు కూలీల కొరత



వరి నాట్లు వేస్తున్న ఇద్దరు కూలీలు

● జిల్లాలో ముమ్మరంగా నాట్లు ● 30804 హెక్టార్లలో సాగు లక్ష్యం

● ఒకేసారి వేస్తుండడంతో డిమాండ్ ● రెట్టింపు కూలీ ఇస్తామన్నా.. దొరకని కూలీలు ● నార్లు ముదిరిపోతాయనే ఆందోళనలో రైతులు



కాలిబాటలు ఏర్పడేలా వరి నాట్లు వేస్తున్న వలస కూలీలు



కడప రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక పోవడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. జూన్, జూలై నెలలో రైతులు వర్షం కోసం ఎదురు చూపులు చూశారు. చివరకు ఆగస్టు మొదటి వారం నుంచి జిల్లాలో ఓ మోస్తారు వర్షాలు పడటంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వస్తుండడంతో కేసీ కెనాల్, పెన్నానది పరివాహ ప్రాంతాలతో పాటు ఇతర వరి సాగు అధారిత ప్రాంతాల్లో రైతులంతా ఒకేసారి వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కూలీల కొరత ఏర్పడింది. సాధారణ రోజుల కన్నా రెట్టింపు కూలీ ఇస్తామంటున్నా కూలీలు అందుబాటులో లేని పరిస్థితి. మామూలు రోజుల్లో వరి నాట్లు వేసేందుకు ఒక ఎకరాకు రూ.5వేలు ఇచ్చేవారు. ఈ క్రమంలో ఆగస్టు మొదటి వారం వరకు అడపాదడపా చేపట్టిన వరినాట్లుకు రూ.5వేలు చెల్లించారు. ఇప్పుడు రూ.7వేలు ఇవ్వడంతో పాటు అదనంగా ఆటో చార్జీలు కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నా కూలీలు దొరకడం లేదు. సాధారణంగా పొలం పనులకు వచ్చే మహిళా కూలీలకు రోజుకు రూ.250 నుంచి రూ. 300ల వరకు ఇస్తారు. అదే వరినాట్లు వేసే కూలీలకు రోజుకు రూ. 500 వరకు ఇస్తారు. ఒక ఎకరా వరి నాటుకు 10 మంది వరకు కూలీలు పడతారు. అదే ఒప్పందం అయితే ఒక ఎకరాకు 5 నుంచి 7 మంది కూలీలు నాట్లు వేస్తారు.

15 మండలాల్లో ముమ్మరంగా వరినాట్లు

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలతో ఆగస్టు మొదటి వారం నుంచి కురుస్తున్న వర్షాలకు కేసీ కెనాల్ ఆయుకట్టుతో పాటు, పెన్నానదికి వరద నీరు ప్రవహిస్తోంది. అలాగే జిల్లాలోని గండికోట, మైలవరం, బ్రహ్మంసాగర్, సర్వరాయసాగర్ తదితర ప్రాజెక్టులకు వరద నీరు వచ్చిచేరుతోంది. తద్వారా ఆయా ప్రాంతాలలోని చెరువులకు కూడా నీరు చేరుతోంది. దీంతో ఆయా ఆయకట్టు కింద ఉండే చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, బి.మఠం, ప్రొద్దుటూరు, ఎస్. మైదుకూరు, చెన్నూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, చక్రాయపేట, బి.కోడూరు, వల్లూరు, కలసపాడు, సిద్దవటం, పెండ్లిమర్రి, కడప, రాజుపాళెం, యర్రగుంట్ల, కాశినాయన మండలాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. 2025 ఖరీఫ్‌లో 30,804 హెక్టార్లలో వరి పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 8082 హెక్టార్లలో మాత్రమే వరి సాగైంది. ఇంకా 22,722 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది.

వలస కూలీలతో వరినాట్లు

● ఆసక్తి చూపుతున్న కేసీ రైతులు

దువ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టులో వలస కూలీలతో వరి నాట్లు వేయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దువ్వూరు మండలంలో పది వేల ఎకరాలకుపైగా కేసీ ఆయకట్టు ఉంది. ఇంచుమించు ఏడు వేల ఎకరాల్లో ప్రతి ఏటా వరి సాగు అవుతుంది. గత నాలుగేళ్లుగా వలస కూలీలు నాట్లు వేసే సమయంలో ఇక్కడకు రావడం జరుగుతోంది. ఈసారి మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి అధికంగా కేసీ ఆయకట్టు పరిధిలో నాట్లు వేసేందుకు వచ్చారు. మండల పరిధిలో 30 బ్యాచ్‌ల్లో సుమారు 800 మంది కూలీలు వచ్చినట్లు వారికి పని కల్పిస్తున్న మధ్యవర్తులు తెలుపుతున్నారు. దువ్వూరుతోపాటు చాపాడు, మైదుకూరు, ఖాజీపేట, రాజుపాళెం మండలాల్లో కూడా ఈ కూలీలే పని చేస్తున్నారు. సాదారణంగా వారు మరాఠి, బెంగాళి, హిందీ భాషలు మాట్లాడుతున్నారు. వరినాటే వలసకూలీలకు రైతులకు మధ్యవర్తులు అనుసంధానంగా వ్యవహరిస్తున్నారు.

సాగు ఖర్చు తగ్గుతోంది

వలస కూలీలతో నాట్లు వేయించడం వలన ఎకరాకు అయ్యే ఖర్చు వెయ్యి నుంచి రూ.1500 దాకా తగ్గుతోందని రైతులు అంటున్నారు. ఇదే కాకుండా పొలాల్లో నారు మోసుకోవడం, నాటే సమయంలో కాలిబాటలు ఏర్పడే విధంగా నాట్లు వేయడంతో రైతులకు భారం తగ్గుతోంది. ఈ తరహాలో వరి సాగు చేయడం వలన తెగుళ్లు తగ్గుతాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. వరి పిలకలు అధికంగా కట్టి దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు.

'భోగంపల్లె'కు నీటి జాడేదీ ?



అడుగంటిన భోగంపల్లె రిజర్వాయర్

మొరవలో పెరిగిన పిచ్చిమొక్కలు ● గుంతలమయమైన ప్రాజెక్టు
కరుణించని వరుణుడు ● ఎడారిని తలపిస్తున్న రిజర్వాయర్
ఇసుక తరలింపుతో రూపు మారిన వైనం ● వాల్మీకిపురానికి తాగునీటి గండం తప్పదా..?

వాల్మీకిపురం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా సాగు, తాగునీరందించిన భోగంపల్లె రిజర్వాయర్ వర్షాభావంతో నీరు అడుగంటాయి. 2015లో ఏకదాటిగా కురిసిన వర్షాలతో రిజర్వాయర్ నీటితో కళకళలాడేది. కొన్నేళ్ల వ్యవసాయానికి, పట్టణ ప్రజలకు నీటి సమస్య లేకుండా కాపాడడం గమనార్హం. అయితే ప్రస్తుతం రిజర్వాయర్ ఎడారిని తలపిస్తోంది. దీంతో కరువు తాండవిస్తోందన్నట్లు కనబడుతోంది. వివరాల్లోకెళితే.....

కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వాల్మీకిపురం పడమటి పొలిమేరల్లో భోగంపల్లె రిజర్వాయర్‌ను నిర్మించారు. దీంతో అటు సాగుకు, ఇటు పట్టణ ప్రజలకు తాగునీరు అందించేలా పథకం రూపొందించారు. ఫలితంగా భవిష్యత్తులో ప్రజలకు సమస్యలు రాకూడదని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని రిజర్వాయర్‌ను నిర్మించారు. 2015 చివరి మాసాల్లో ఏకదాటిగా కురిసిన వర్షాలతో రిజర్వాయర్ నీటితో కళకళలాడింది. దీంతో ఏళ్ల పాటు సాగు, తాగునీటి సమస్య తప్పింది. ఎన్నో ఏళ్లగా తాగు, సాగునీరందిస్తున్న రిజర్వాయర్‌లో ఒక్కసారిగా నీటి జాడ కనుమరుగవుతుండడంతో రైతులు పట్టణ ప్రజలు, సైతం తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సమయానుకూలంగా వర్షాలు కురవక పోవడంతో రిజర్వాయర్ ప్రాంతం ఎడారిని తలపిస్తోంది. అంతే కాకుండా వైసీపీ కాలంలో భోగంపల్లె రిజర్వాయర్ మొదలుకుని బాహుదా నది కాల్వ ప్రాంతాలను సైతం ఇసుక తవ్వకాలతో గుల్ల చేసేశారు. రిజర్వాయర్ ప్రాంతంలో సైతం ఎవరికి తోచింది వారిదే అన్న తడువుగా ఇసుకను రాత్రింబవళ్లు అక్రమ రవాణాకు తెరలేపడం గమనార్హం. అప్పట్లో అధికారులు కూడా వీటిపై నిఘా పెట్టకపోవడంతో ప్రస్తుతం పట్టణ ప్రజల దాహార్తికి గండం రానుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎటు చూసినా నీటి జాడ లేకపోవడం, మరోవైపు నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంతో భోగంపల్లె రిజర్వాయర్ రూపురేఖలు కోల్పోందనే చెప్పాలి. ప్రస్తుతం పట్టణ ప్రజలకు వారం, పదిరోజులకు ఒకసారి గాని తాగునీరు అందక అవస్థలకు గురవుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పట్టణ ప్రజలు తాగునీటికి తిప్పలు పడాల్సిందే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వాయర్‌లో ప్రభుత్వం రెండు బోర్లను ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీరు అడుగంటి పోవడం ముందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చొరవ దృష్టిపెట్టాలని కోరుతున్నారు. వరుణుడు కరుణించి భోగంపల్లె రిజర్వాయర్ నీటితో కళకళ లాడాలని పొలిమేర దేవరులు, ఆలయాల్లో పూజలు సైతం చేస్తుండడం గమనార్హం. ఈ విషయమై పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం రెండు బోరుబావుల నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్నామని రాబోయే రోజుల్లో సమస్య తలెత్తకుండా నూతన బోరుబావులు ఏర్పాటు, పట్టణ ప్రజలకు ప్రత్యామ్నాయంపై దృష్టిపెడతామన్నారు. నీటి సరఫరా తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి అనుమతుల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.





పిచ్చిమొక్కలు పెరిగిన మొరవ ప్రాంతం - రిజర్వాయర్‌లో చిన్నపాటి గుంతలకే పరిమితమైన నీరు

అభివృద్ధిలో బాబుది చెరగని ముద్ర

● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెరగని ముద్ర వేశారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రాబు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు అండగా నిలిచారన్నారు. హంద్రీ - నీవా జలాలను తీసుకొచ్చి రాయలసీమను రతనాల సీమగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వైసీపీ విధ్వంస, అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి కల్పించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు మాట్లాడుతూ రాయలసీమకు కూడా కృష్ణా జలాలు తీసుకొచ్చిన అపరభగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడన్నారు. సమావేశంలో కురబలకోట మండల టీడీపీ అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, టీడీపీ నేతలు యర్రగుడి సురేష్, కేవీ రమణ, జనార్ధన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, నేతలు నాగిరెడ్డి, రాము, ఫజురుల్లా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే పవన్ ధ్యేయం

● ములకలచెరువులో అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ, జనసేన ఇన్‌చార్జులు జయచంద్రారెడ్డి, సాయినాథ్

ములకలచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పనిచేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ పోతుల సాయినాథ్ అధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన వారు అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి ప్రజలకు పంచి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, జనసేన, టీడీపీ నేతలు యర్రగుడి సురేష్, కేవీ రమణ, వైజీ సురేంద్రయాదవ్, సుదర్శన్, షోరూం సూరి, ఉత్తన్న, భజంత్రీ రామాంజులు, బావాజాన్, చోటు, శంకర, శీన తదితరులు పాల్గొన్నారు.

పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం



రక్త దానం చేస్తున్న జనసేన నేతలు

పీలేరు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, పీలేరు ఏఎంసీ డైరెక్టర్ కలప రవి రక్తదానం చేపట్టారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల కిషోర్ నాయుడు, జనసేన నేతలు మోహనకృష్ణ, గురుమోహన్, ధనశేఖర్, రాజేష్, నరేష్, బాటసారి, సుధాకర్, మణి, ధనంజయ, సుబ్రమణ్యం, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

ముమ్మరంగా సామాజికసేవ



నీరుగట్టువారిపల్లె రక్తదాన శిబిరంలో పాల్గొన్న జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్

మదనపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. అనాథ ఆశ్రమాల్లో అన్నదానం, ఉచిత రక్తదాన శిబిరం, ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ, పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌లో అడపా సురేంద్ర, తోట కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదానంలో జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ ఓసూరి కిరణ్‌కుమార్, తదితరులు రక్తదానం చేశారు.

శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో..



అనాథ ఆశ్రమంలో పిల్లలతో జనసేన నేత శ్రీరామ హరిహరణ్

నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక స్త్రీశిశుసంక్షేమశాఖ హాస్టల్‌లోని అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో జనసేనే నేతలు శ్రీరామ హరిహరణ్, దారం అనిత, దారం హరిప్రసాద్, డి.కె.చైతన్య, లీలాకర్, సోను, సాయి, శంకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం విజేత భానుమతి



బి.కొత్తకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ ప్రసాదం, పవిత్రమైన భగవద్గీతను భానుమతి దక్కించుకున్నారు. మంటపాల వద్ద స్వామివారి లడ్డూను వేలం వేసి హెచ్చు పాటదారునికి అందిస్తారు. అయితే బి.కొత్తకోటలోని ఉత్సవకమిటీ లడ్డూను రూ.50 ప్రకారం భక్తులకు కూపన్లు విక్రయిస్తే 170మంది కొన్నారు. మంగళవారం లక్కీడిప్ తీయగా భానుమతికి లాటరీ తగిలింది. దీంతో ఉత్సవ కమిటీ ఆమెకు లడ్డూ, భగవద్గీతను బహూకరించారు. ఈ వినూత్న సంప్రదాయాన్ని పలువురు అభినందించారు. అనంతరం ప్రతిమ వద్ద పెద్దసంఖ్యలో అన్నసంతర్పణ గావించారు.

రైతులకు తప్పని నిరీక్షణ

మండుటెండలో యూరియా కోసం క్యూ ● నెల రోజులుగా పడిగాపులు ● బస్తాపై రూ.30 అదనం





పీలేరులో యూరియా కోసం మండుటెండలో క్యూలైన్‌లో రైతులు - ములకలచెరువులో యూరియా తీసుకునేందుకు వేచి ఉన్న రైతులు

పీలేరురూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్, వర్షాలు కురుస్తుండడంతో, వరి, వేరుశనగ, ఇతర పంటలకు అదును కావడంతో రైతులు వరి నాట్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో వరి సాగు చేసి నెల రోజులు, మరికొన్ని చోట్ల 20 రోజులు దాటుతున్నా ఇప్పటికీ రైతులు యూరియా వేయలేదు. నాట్లు వేసిన 15 రోజులకే యూరియా చల్లాల్సి ఉండగా అవసరం మేరకు యూరియా దొరకడంలేదు. దీంతో యూరియా కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు వచ్చే యూరియా గంటల వ్యవధిలోనే అయిపోతుంటే రైతులకు కడగండ్లు తప్పడంలేదు. అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్ప అధికారులు రైతుల అవసరాల మేరకు యూరియా తెప్పించడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని విమర్శలు లేకపోలేదు. సోమవారం మార్కెట్ యార్డు వద్ద ఓ ఎరువుల దుకాణంలో యూరియా విక్రయాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పీలేరు, పులిచెర్ల ఇతర మండలాల రైతులు పెద్ద సంఖ్యలో ఆ దుకాణం వద్దకు చేరుకున్నారు. ఓవైపు మండుటెండ, మరోవైపు ట్రాఫిక్ అయినా పట్టించుకోకుండా షాపు యజమాని రైతులను ఎండలో క్యూలో నిలబెట్టారు. మరోవైపు ఒక్కో రైతుకు ఒక మూటే ఇవ్వడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవసరం మేరకు యూరియా దొరక్క పోవడంతో కొన్ని చోట్ల డీఏపీ కొంటనే యూరియా ఇస్తామని వ్యాపారులు మెలిక పెడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ఒక్కో బస్తాపై రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వరి, వేరుశనగ, ఇతర పంటలకు అదును కావడంతో రైతులు అధికంగా యూరియా కోసం పైబడుతున్నారు.

రైతులకు 'యూరియా' కష్టాలు

ములకలచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కష్టాలు తొలగడం లేదు. స్థానిక ఓ ఎరువుల దుకాణంలో యూనియా విక్రయిస్తున్నారని తెలియడంతో పెద్ద ఎత్తున రైతులు వచ్చారు. యూరియా తీసుకునేందుకు గంటల తరబడి పడిగాపులు కాశారు. రైతులు భారీగా తరలిరావడంతో చేసేది లేక దుకాణదారుడు టోకన్లు ఇచ్చాడు. వరుస క్రమంలో నెంబర్ల వారీ యూరియాను విక్రయించాడు. రెండు మూటల యూరియాను రూ.550కు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు రైతులు తెలియజేశారు. మండలంలో ఎక్కడా యూరియా దొరక్కపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీరు, విద్యుత్ సమస్యలపై స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుప్రసాద్

కలకడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, విద్యుత్ సమస్యలపై స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులను కోరారు. ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షత మంగళవారం జరిగిన మండల్ మీట్‌లో బాలయ్యగారిపల్లె సర్పంచ్ విశ్వనాథ్ మాట్లాడు తూ తమ పంచాయతీ పరిధిలో ఝరి కోన పైప్‌లైన్ దెబ్బతినడంతో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తాయన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పనుల నిమితం వచ్చే వృద్ధులు ఇబ్బంది పడుతున్నట్లు సమావేశంలో తెలిపారు. బాలయ్యగారిపల్లె కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు, అనర్హులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని పలుమార్లు తెలిపినా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డురంగా ఉందన్నారు. ఎంపీపీ శ్రీదేవి సంక్షేమ పథకాలు, అర్హులైన ప్రజలకు అందేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో పల్లెలో పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది పని చేయాలన్నారు. ఏఓ శ్రీనివాస్ రైతుల సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజమ్మ, డీఈ రమణయ్య, ఎంఈఓ మునీంద్రనాయక్, డీటీ భార్గవి, డాక్టర్లు మల్లికార్జున, మోహన్, తేజకల్యాణ్, ఏపీఓ సుజాత, ఎంపీటీసీ, సర్పంచులు పాల్గొన్నారు.

బలహీన క్షణాలను అధిగమిస్తే విజయం మీదే



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కొన్ని బలహీనక్షణాలను నిగ్రహంతో అధిగమిస్తే జీవితంలో విజయం సాధించవచ్చని బి.కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలను ముట్టుకునే ముందు ఆలోచించాలని, సరదాకోసమో, ప్రలోభంతోనో తాత్కాలిక తృప్తికోసం తప్పు చేసి జీవితాలను నాశనం చేసుకున్న వారిని చూసి జాగ్రత్త పడాలన్నారు. ఈవ్‌టీజింగ్ బాధితులుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళా రక్షణ కోసం పోలీస్‌శాఖ తీసుకొచ్చిన యాప్‌లు, టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన పెంచుకోవడం, తోటి విద్యార్థులకు తెలియజెప్పాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఓ బొజ్జగణపయ్య..నీ బంటు నేనయ్య...



కొత్తపేటలో పూజలందుకుంటున్న వినాయకుడు

మదనపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలో 40 ఏళ్లగా వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆనవాయితీలో భాగంగా కరుణాకర్ నివాసం ముందు ఏర్పాటు చేసిన పందిరిలో పండుగరోజు మొదలు 11 రోజుల పూజలు అనంతరం నిమజ్జనం చేయనున్నారు. యువత పి.శ్యామ్, పి.దినకర్, పి.బాజ్జి, బి.రాము, ఎస్.రూపేష్, కె.ప్రసన్న, డి.ప్రేమ, పి.సుమన్, యూ.రఘు, తదితరులు పాల్గొన్నారు.

భూసార రక్షణకు నానో ఎరువులు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ శివనారాయణ

కలకడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూసార రక్షణకు నానో ఎరువుల వాడకం రైతులకు మేలు కలిగిస్తుందని డీఏఓ శివనారాయణ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఎనుగొండపాలెం, కదిరాయచెరువు గ్రామాల్లో రైతులతో ఆయన మాట్లాడుతూ వివిధ పంటలు సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. దీంతో ప్రభుత్వం ప్రయోజనాలు పొందే అవకాశముందన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో వేరుశనగ సాగు చేయలేకపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా ఉలవ పంటను సాగు చేసుకోవాలన్నారు. రైతు సేవా క్రేంద్రాల సిబ్బందిని సంప్రదించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వరి, వేరుశనగ పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజు, ఏవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో సీపీఐ ధర్నా

ములకలచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట మంగళవారం సీపీఐ నేతలు ధర్నా చేపట్టారు. రాజంపేటలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నేతలను ముందస్తు హౌస్ అరెస్టు చేశారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, నేతలు నిజాముద్దీన్, మల్లికార్జున, రెడ్డెప్ప, ఎల్లప్ప, సుబ్బన్న, రమణప్ప, వెంకటరమణ, అమరావతి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో రెండు రోజులు అంతరాయం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రెండు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్‌కో ఏఈ నాగరాజ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 33కెవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధ, గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వెంగంవారిపల్లి పంచాయతీలో వ్యవసాయానికి త్రీ ఫేస్ విద్యుత్ కొంచెం అటు ఇటుగా అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు విద్యుత్ అధికారులతో సహకరించాలని కోరారు.

నేత్రదానం చేద్దాం

వాల్మీకిపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి చిరంజీవులవం అవుదామని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జులేఖబేగం పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా చింతపర్తిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నేత్రదానం ప్రాముఖ్యత, ఆవశ్యకత, ఎవరు చేయవచ్చు, ఎవరిని సంప్రదించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ, సీహెచ్‌ఓ అరుణ, సూపర్‌వైజర్లు బానూబీ, బహుద్దీన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగసభ

బి.కొత్తకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనులపై జరిగిన సామాజిక తనిఖీపై నేడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బహిరంగసభ నిర్వహించనున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో తమ విచారణలో బయటపడిన అవకతవకలను తనిఖీ బృందం డ్వామా అధికారుల సమక్షంలో బహిర్గతం చేయనున్నారు. 1ఏప్రిల్ 2024 నుంచి 31మే2025 వరకు జరిగిన 1226 పనులకు రూ. 5.69కోట్ల నిధులను ఖర్చు చేసినట్టు ఏపీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. వీటిలో రూ.5.38 కోట్లు కూలీల చెల్లింపులు కాగా రూ.31.47 లక్షలు మెటీరియల్ ఖర్చు కింద చెల్లించారు. ఈ నెల 18 నుంచి 26 వరకు తనిఖీ బృందం గ్రామాల్లో విచారించి వెంటనే సభ నిర్వహించకుండా వారం రోజుల తర్వాత బహిరంగసభ పెడుతున్నారు. తనిఖీపై ముందస్తు సమాచారం బయటకు చెప్పకుండా కానిచ్చేశారు. గుట్టుగా జరిగిన తనిఖీలో ఏమేరకు అక్రమాలు వెలుగుచూశాయో నేడు తెలియనుంది.

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. వారం రోజులుగా పాత జూనియర్ కళాశాల మైదానంలో గణేశ్ యూత్ ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను మంగళవారం మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పేళుల్ల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ప్రజలు స్వామి వారిని దర్శించుకున్నారు. వినాయకుడిని ఊరేగింపుగా తీసుకువెళ్లి మల్లయ్యకొండ కింద గల మద్దాతం బావిలో నిమజ్జనం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రామసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సుడిగాలి పర్యటించి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. మూగవాడి, అరికెల, రామసముద్రం, ఆర్.నడింపల్లి, కాప్పల్లె పంచాయతీల్లో మొత్తం తొమ్మిది మందికి ఎనిమిది లక్షల యాభైవేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీలు మునివెంకటస్వామి, శివశంకర్, శివారెడ్డి, రూపేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, మాలమహానాడు అధ్యక్షుడు కిట్టు, నాగరాజ పాల్గొన్నారు.

రీజియన్‌లోనే అధిక ఆదాయం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆగస్టులో రీజియన్‌లోనే రూ.565.76 లక్షలు ఆదాయం, కేఎంపీఎల్ 5.39, ఓఆర్ 80శాతం వచ్చిందని డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. ఉద్యోగులతో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు శ్రమించి సెప్టెంబరులో కూడా డిపోకు ఆదాయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి పాల్గొన్నారు.